ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి ప్రకాశం 5
సోమవారం 9, సెప్టెంబరు 2024



జై గణేశా..

వైభవంగా వినాయక చవితి

- ఊరూరా భారీ ప్రతిమల ఏర్పాటు
- మండపాల వద్ద భక్తుల సందడి
- తీరంలో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ దామోదర్




మార్కాపురంలో హోమం చేస్తున్న భక్తులు



వినాయక చవితి పండుగను జిల్లావ్యాప్తంగా ప్రజలు శనివారం వైభవంగా జరుపుకొన్నారు. పట్టణాలతోపాటు పల్లెల్లోనూ పెద్దసంఖ్యలో పందిళ్లను ఏర్పాటు చేసి గణనాథులను కొలువుదీర్చారు. పత్రి, ఫలాలు, ఉండ్రాళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వారివారి ఇళ్లలో పూజలు నిర్వహించిన భక్తులు సాయంత్రం నుంచి దేవాలయాలకు రావడంతో అవి కిటకిటలాడాయి. పలు ఆలయ ప్రాంగణాల్లో సైతం వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. భిన్నరూపాల్లో కొలువు దీరిన భారీ గణేశుని ప్రతిమలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై పోలీసులు దృష్టి సారించారు. ఎస్పీ దామోదర్ ఆదివారం కొత్తపట్నం మండలంలోని పల్లెపాలెం తీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనాల్లో ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- ఒంగోలు కల్చరల్




రంగుతోటలో 3116 వెండి, బంగారు పూలతో ఐశ్వర్య గణపతి




కీర్తివారిపాలెం వద్ద అక్రమంగా తవ్విన ఇసుక

నిల్వలు నిల్

తీవ్రమైన ఇసుక కొరత

పూర్తిస్థాయి ఉచిత విధానంపై ప్రభుత్వం మీనమేషాలు

- రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు
- డిమాండ్ నేపథ్యంలో భారీగా ధర పెంచి విక్రయాలు
- నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరత తీవ్రమైంది. దీంతో ధర పెరిగింది. అయినప్పటికీ తగినంత ఇసుక దొరక్క భవన నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం పూర్తిస్థాయి అమలులో మీనమీషాలు లెక్కించడం, దానికి తోడు వర్షాలు కురవడం కూడా సమస్య తీవ్రతను పెంచింది. దీంతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అవస్థ పడుతున్నారు. ప్రధానంగా చిన్నచిన్న గృహాలు కట్టుకునే వారి పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లా మొత్తంగా సగంలో ఆగిపోయిన గృహాలు పెద్దసంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఇసుకకు వచ్చిన డిమాండ్‌ను కొన్ని ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా ఇసుకను తవ్వి నిల్వ చేసి అధిక ధరకు అమ్ముతున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 11వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక విధానం అమల్లోకి వస్తుందని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ అది ఎంత వరకు సాధ్యమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ వెంటనే ఇసుక పాలసీ మారింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇసుక కష్టాలు తీరిపోయాయని భవన నిర్మాణదారులు ఆనందించారు. సొంతింటి కలను నెరవర్చుకోవాలనుకున్న వారు కూడా సంబరపడ్డారు. కానీ అంతలోనే మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా ప్రభుత్వపరంగా ఇసుక నిల్వలు కనిపించటం లేదు. దీనికితోడు ఇసుక దొరికే రీచ్‌ల్లో తవ్వుకునేందుకు అధికారిక అనుమతులు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పూర్తి విధివిధానాలు ప్రకటిస్తామంటూ రవాణాకు బ్రేక్ వేసింది. ఇటు ఉన్న నిల్వలు అయిపోగా, అటు కొత్తగా ఇసుక తెచ్చుకునేందుకు అవకాశం లేక వినియోగదారులు అవస్థలు పడటం ఆరంభమైంది.

జోరుగా అక్రమ విక్రయాలు

నిర్మాణదారుల అవసరాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు రంగ ప్రవేశం చేశారు. ఆయా ప్రాంతాల వారీ కొందరు ఇసుకను అక్రమంగా తవ్వి నిల్వ చేసి విక్రయించడం ప్రారంభించారు. మరికొందరు రేయింబవళ్లూ అదేపనిలో నిమగ్నమయ్యారు. జిల్లామొత్తంగా కాకపోయినా కొన్ని ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు ఇసుక అక్రమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో పవర్ ఉన్న కొందరు వాహన యజమానులు దీన్నే ఆదాయమార్గంగా మార్చుకున్నారు. ధరను పెంచకపోయినా వారి కనుసన్నల్లోనే ఇసుక రవాణా జరుగుతుండటంతో సామాన్యులకు అందటం లేదు. దర్శి నియోజకవర్గంలో గుండ్లకమ్మ, చిలకలేరు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మార్కాపురం ప్రాంతంలో సుమారు ఎనిమిది చోట్ల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి అమ్ముతున్నారు. ధరను సైతం పెంచేశారు. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన ఇసుకను ఎర్రగొండపాలెంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో కొందరు వ్యక్తులు ట్రాక్టర్ ఇసుకను రూ.1500 ప్రకారం అక్రమంగా విక్రయిస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు, విక్రయాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. కనిగిరి ప్రాంతానికి నెల్లూరు వైపు నుంచి వచ్చే ఇసుక రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడం, ఇసుకకు డిమాండ్ రావడం అక్రమార్కులకు కలిసొచ్చింది. అవకాశాన్ని ఆసరా చేసుకొని గతం కన్నా ఇసుక ధరను పెంచేశారు. గిద్దలూరు ప్రాంతంలో గతంలో ఉన్న ధర కన్నా టన్నుకు రూ.300 అదనంగా వసూలు చేస్తున్నారు. 35 టన్నుల ఇసుక పట్టే లారీకి 20 టన్నులు మాత్రమే ఎత్తుకునే అవకాశం ఇవ్వడంతో కొనుగోలుదారులు అధికంగా నష్టపోతున్నారు. మార్కాపురం ప్రాంతంలో టన్ను ఇసుకను రూ.2వేలకు విక్రయిస్తున్నారు. ఎర్రగొండపాలెంలోనూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన లారీ ఇసుకపై రూ.7వేలు అదనంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇసుక ధరను అక్రమార్కులు పెంచేశారు.

పట్టించుకోని అధికారులు

ధర పెరగటంతోపాటు సరిపడా ఇసుక దొరక్కపోవడంతో నిర్మాణదారులు పనులను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి వర్షాల సమస్య కూడా తోడైంది. ఇటు అక్రమ వ్యాపారం, ధర పెరిగిపోతున్నా మైనింగ్, ఎస్ఈబీ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులపై కొరడా ఝులిపించడమే తప్ప అక్రమ వ్యాపారం చేసే వారి జోలికి వెళ్లడం లేదు. పైగా అధికార పార్టీ వారు అక్రమ అమ్మకాలు చేస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 11 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ అందుకు అనుగుణమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.


మార్కాపురం పట్టణం పెదనాగులవరం రోడ్డులో ఇసుక కొరతతో నిలిచిపోయిన నిర్మాణాలు

నిలిచిపోతున్న పనులు

చీరాలలో ఇసుక అక్రమ అమ్మకాలు కొద్ది రోజుల వరకు తారస్థాయిలో జరిగాయి. గత నాలుగైదురోజులుగా అధికారులు అడ్డుకట్ట వేసినట్లు కనిపిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వేటపాలెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డంప్ ఖాళీ అయిపోయింది. పర్చూరు నియోజకవర్గంలో ఇసుక దొరక్క నిర్మాణ పనులు మందగించాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుకను రూ.6వేల నుంచి 7 వేలకు అక్రమంగా విక్రయించారు. 10 రోజుల క్రితం వరకూ కూడా అక్కడ అలాగే అమ్మారు. ప్రస్తుతం అక్రమ విక్రయాలకు కొంత బ్రేక్ పడటంతో మార్టూరు, పర్చూరు ఇంకొల్లు ప్రాంతాల్లో కూడా ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. అద్దంకి ప్రాంతంలో గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.3500 విక్రయించారు. అదే తరహాలో ఈ ప్రభుత్వంలోనూ అమ్మకాలు మొదలయ్యాయి. మంత్రి రవికుమార్ నుంచి హెచ్చరికలు రావడంతో ధరను రూ. 2,500కు తగ్గించారు. ధర తగ్గటంతో విక్రయాలు పెరిగి ఇసుక కొరత నెలకొంది. కందుకూరు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు బహిరంగంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : ఒంగోలులోని కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిలో ప్రతివారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆమేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది వెళ్లారని ఆమె తెలిపారు. ఈనేపథ్యంలో మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలన్నారు. దూరప్రాంతాల నుంచి ఒంగోలుకు, డివిజన్, మండల కేంద్రాలకు ఎవ్వరూ రావద్దని కలెక్టర్ కోరారు

ఇన్‌చార్జి జేసీగా శ్రీలత

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : జాయింట్ కలెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలతకు అప్పగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు. రెగ్యులర్ జేసీ గోపాలకృష్ణను ఎన్టీఆర్ జిల్లాలో వరద సహాయ కార్యక్రమాల కోసం ప్రభుత్వం అక్కడికి డిప్యుటేషన్ వేసింది. దీంతో పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు. గోపాలకృష్ణ వచ్చే వరకూ ఆమె ఆ బాధ్యతల్లో కొనసాగుతారు.

డీసీసీ అధ్యక్షుడిగా సైదా

ఒంగోలు (క్రైం)/ పొదిలి, సెప్టెంబరు 8 : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పొదిలికి చెందిన షేక్ సైదా నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. సైదా 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. గతంలో పార్టీ జిల్లా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం సమితి కన్వీనర్‌గా ఉండి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలను ఏకం చేసి పోరాటం చేశారు. ఆయనకు పదవి రావడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు సైదా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకూ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ఈదా సుధాకర్‌రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీపతి ప్రకాష్, ఒంగోలు నగర అధ్యక్షురాలుగా దాసరి నాగలక్ష్మిని నియమించారు.


షేక్ సైదా

వరద బాధితులకు అండ

- కలెక్టర్ అన్సారియా పిలుపుతో ముందుకొస్తున్న దాతలు
- జిల్లా నుంచి 1.30లక్షల ఆహార ప్యాకెట్లు, 50వేల వాటర్ బాటిళ్లు
- ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలింపు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : విజయవాడ వరద బాధితులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తోంది. కలెక్టర్ అన్సారియా చొరవతో ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. దాతల సహకారంతో ఒంగోలులోని మూడు ప్రాంతాల్లో ఆహారాన్ని వండించి, ప్యాకింగ్ చేయించి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు పంపుతున్నారు. ఐదు రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం కూడా లక్షా 30వేల ఆహార ప్యాకెట్లు, 50వేల వాటర్ బాటిళ్లను పంపారు. సంతనూతలపాడు శాసనసభ్యుడు విజయ్‌కుమార్ రూ.5 లక్షల వ్యయంతో పది వేల పులిహోర ప్యాకెట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ద్వారా విజయవాడకు తరలించారు. జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో పదివేల పులిహోర ప్యాకెట్లను పంపారు. ఇంకోవైపు వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు కూడా బాధితులకు తమవంతుగా విరాళాలను అందజేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి కూడా అవకాశం ఉన్న మేరకు బాధిత కుటుంబాలకు ఆహారం, మంచినీళ్లను అధికార యంత్రాంగం చొరవతో వాహనాలను ఏర్పాటు చేసి విజయవాడకు పంపుతోంది. ఒంగోలులోని ఏ-1 కన్వెన్షన్ హాలులో ఆహారం ప్యాకింగ్‌ను కలెక్టర్ అన్సారియా ఆదివారం పరిశీలించారు. పులిహోరను రుచి చూసి అధికారులకు సూచనలు చేశారు. ఇక్కడి నుంచి పారిశుధ్య కార్మికులు అక్కడికి వెళ్లి పలుకాలనీల్లో పనులు చేస్తున్నారు.


ఆహారం ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

భారీగా విరాళాలు

ఒంగోలు (కార్పొరేషన్) : విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు దాతలు ముందుకొస్తున్నారు. భారీగా విరాళాలు అందజేస్తున్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రూ.50 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ తమవంతుగా రూ.10 లక్షలు, భగీరథ కెమికల్స్ యాజమాన్యం రూ.10లక్షలు, వ్యాపారవేత్త సూదనగుంట వెంకట్రామయ్య రూ.10లక్షలు, క్విస్ విద్యా సంస్థల చైర్మన్ నిడమానూరి నాగేశ్వరరావు సొంత నిధులు రూ.2లక్షలు సీఎంకు అందజేశారు. ఇలా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో ఆదివారం ఒంగోలు నియోజకవర్గం నుంచి సుమారు రూ.కోటి విరాళాన్ని ఇచ్చారు.


సీఎంకు విరాళాలు అందజేస్తున్న శిద్దా రాఘవరావు, అతని సోదరులు, గోరంట్ల రవి, నిడమానూరి నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే జనార్దన్


గాంధీరోడ్డులో గణేశుడికి పూజలు చేస్తున్న గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు


కొణిజేడు బస్టాండులో భారీ వినాయక ప్రతిమ



కుట్టుబోయినపాలెంలో..


మౌర్యా ఇన్‌లో జరిగిన చవితి వేడుకల్లో పాల్గొన్న బత్తిన మహేష్


మైనంపాడులో ఏర్పాటు చేసిన హరిత వినాయకుని విగ్రహం


హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు


చీమకుర్తిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద..

వైభవంగా వినాయక చవితి

వాడవాడలా భారీగా స్వామివారి విగ్రహాల ఏర్పాట్లు

ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని పలుప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం వినాయక ప్రతిమలు, పత్రి వంటి పూజాసామగ్రి కొనుగోలుకు ప్రజలు భారీ నగరంలోని నెల్లూరుబస్టాండు, కొత్తమార్కెట్, గాంధీరోడ్డు, లాయర్‌పేట, కర్నూల్‌రోడ్ మొదలైన ప్రాంతాలకు తరలిరావడంతో భారీగా రద్దీ నెలకొంది. మరోవైపు పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇక వినాయక చవితి మొదలు తొమ్మిది రోజులపాటు నిర్వహించే నవరాత్రి ఉత్సవాలు పలుప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. స్థానిక రాజాపానగల్‌రోడ్డు, కొణిజేడు బస్టాండు, లాయర్‌పేట, సంతపేట, నెల్లూరుబస్టాండ్, కర్నూల్‌రోడ్డు, రామయ్యనగర్, రంగుతోట, గాంధీరోడ్డు, సీలాయపాలెం, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, రామ్‌నగర్, గద్దలగుంట, రాజీవ్‌నగర్ తదితర పలు ప్రాంతాలలో వినాయక నవరాత్రి మండపాలను ఏర్పాటుచేసి భక్తులు పూజలు నిర్వహించారు. దక్షిణం బజారులో 33 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన గణేషుడి విగ్రహం ప్రజలను విశేషంగా ఆకర్షిస్తుంది. అదేవిధంగా నగరంలోని పలు అపార్టుమెంట్లలో సైతం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చవితి రోజున ఉదయం వారివారి ఇళ్లలో పూజలు నిర్వహించిన భక్తులు సాయంత్రం నుంచి స్థానిక దేవాలయాలకు రావటంతో కిటకిటలాడాయి. పలు దేవాలయ ప్రాంగణాల్లో సైతం విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

ఎస్పీ దంపతుల పూజలు

ఒంగోలు(క్రైం): వినాయక చవితిని పురస్కరించుకొని ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహానికి శనివారం ఎస్పీ ఏఆర్.దామోదర్ తన కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా ప్రజలు, పోలీసు సిబ్బంది సుఖశాంతులతో ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. ప్రజలు వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర రావు, ఆర్ఐలు రమేష్‌కృష్ణన్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

మౌర్యా ఇన్‌లో..

ఒంగోలు(కలెక్టరేట్): స్థానిక కర్నూలురోడ్డులోని మౌర్యా ఇన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు, మౌర్య ఇన్ అధినేత బత్తిన మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో షేక్ ఖలీఫాతుల్లాబాషా, రావులపల్లి నాగేంద్రయాదవ్, రాయపాటి అజయ్‌కుమార్, కంది మురళీ, సయ్యద్ సుభానీ, కేశినేని రమేష్, కోటేశ్వరరావు, కర్రిబాబురావు, ఈదర రమణ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మండలంలోని పలుగ్రామాల్లో వినాయకచవితి పండుగను శనివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. మైనంపాడులోని శ్రీరాముల వారి దేవాలయంలో హరిత వినాయకుడిని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీసభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: వినాయక చవితి సందర్భంగా మద్దిపాడు మండలంలోని అన్ని గ్రామాలలో మండపాలు ఏర్పాటుచేసి విగ్రహాలను ఆవిష్కరించారు. అదేవిధంగా ఇళ్లలో సైతం మట్టిప్రతిమలను ఉంచి పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఉత్సవ కమిటీలు విభిన్న రూపాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటుచేశారు. మద్దిపాడులో 20 మండపాలు ఏర్పాటుచేయగా బసవన్నపాలెం, నందిపాడు, సీతారాంపురం గ్రామాల్లో ఉత్సవ కమిటీలు నవరాత్రులు నిర్వహిస్తున్నారు. బసవన్నపాలెంలో టీడీపీ సీనియర్ నాయకులు మండవ రంగారావు, మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక పలు సాంస్కృతిక కార్యక్రమాలను మండపాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మండలంలో వినాయకచవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. చీర్వానుప్పలపాడు, నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసిన రెండు గణనాథుల విగ్రహాలను ఆదివారం కమిటీ సభ్యులు కోలాహలంగా కనపర్తి సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. మండల పరిధిలో శనివారం రాత్రికి 70 వినాయక మండపాలకు అనుమతి పొందారని, తీరప్రాంతంలో నిమజ్జనం కసం బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: మండలంలో వినాయకచవితి వేడుకలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వాడవాడలా మండపాలను ఏర్పాటు చేసి వాటిలో కొలువుదీరిన గణనాథుని విగ్రహాలకు విశేషపూజలు జరిపారు. చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులతో కలిసి విశేష పూజలు జరిపారు. పట్టణం, మండలంలోని గ్రామాల్లో మొత్తం 125 విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాల వద్ద ఎటువటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసులు గస్తీని నిర్వహిస్తున్నారు.


సమతానగర్‌లో టెంకాయలతో రూపొందించిన గణేశుడికి నమస్కరిస్తున్న భక్తులు


అంకమ్మపాలెంలో వినాయక మండపంలో ఏర్పాటు చేసిన శివలింగాలు


నగరంలో వినాయకపందిళ్లలో నృత్యం చేస్తూ సందడి చేస్తున్న యువత


ఒంగోలులోని దక్షిణంబజారులో 33 అడుగుల గణేషుడి విగ్రహం

ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల విరాళం రూ.50లక్షలు

● బొమ్మినేని నేతృత్వంలో సీఎం చంద్రబాబుకు అందజేత


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న బొమ్మినేని రామాంజనేయులు, ప్రతినిధులు

ఒంగోలు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణనీటి సరఫరాల విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) కాంట్రాక్టర్లు విజయవాడ వరద బాధితులకు భారీ విరాళం ప్రకటించారు. అసోసియేషన్ తరుపున రూ.50 లక్షల మొత్తాన్ని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, జిల్లాకు చెందిన సీనియర్ కాంట్రాక్టర్ బొమ్మినేని రామాంజనేయులు నేతృత్వంలో ఆదివార ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి ఇందుకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెలిగపూడి రామాంరావు, ఇతర ప్రతినిధులు వెంకటేష్, పీవీటీ.రాజు, డి.కృష్ణప్రసాద్, కె.బాలకృష్ణ, కె.రామలింగం తదితరులు సీఎంను కలిసినవారిలో ఉన్నారు. విజయవాడ ప్రజానీకాన్ని ఆదుకొని సహాయ, పునరావాస కార్యక్రమాలలో ప్రభుత్వం, ప్రత్యేకించి సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలను వారు అభినందించారు. బాధిత ప్రజలకు తమవంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందించినట్లు అసోసియేషన్ సెక్రటరీ రామాంజనేయులు పేర్కొన్నారు.

కాకతీయ సేవా సమితి విరాళం అందజేత

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 8 : విజయవాడలో వరద కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితులకు మండువవారిపాలెంలోని కాకతీయ సేవా సమితి తమ వంతు సహకారంతో బాసటగా నిలిచింది. ఈ మేరకు ఆదివారం రూ. 2లక్షల చెక్కును ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ కాకతీయ సేవా సమితి చూపితన దాతృత్వానికి అభినందనలు తెలిపారు. నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని పేర్కొన్నారు.

మరో10వేల ఆహార ప్యాకెట్లు సరఫరా


బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 8 : విజయవాడతో పాటు పరిసర ప్రాంత వరద బాధితుల కోసం జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో 10వేల ఆహార ప్యాకెట్లను ప్రత్యేక బస్సులో తరలించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆహార ప్యాకెట్లు తరలిస్తున్న ప్రత్యేకబస్సును జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంతో పాటు జిల్లాలోని డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు, ఈవోఆర్డీలు, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఈ ఆహార ప్యాకెట్లను పంపారు. రెండు రోజుల క్రితం పదివేల ఆహార ప్యాకెట్లను పంపగా తాజాగా ఆదివారం మరో పదివేల ఆహారప్యాకెట్లను పంపినట్లు డీపీవో ఉషారాణి తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో ఎస్.శివప్రసాద్, డీపీఆర్సీ చక్రధర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా భవిత కోసం బాలోత్సవ్

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 8: ప్రజాకళావేదిక ఆధ్వర్యంలో డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి భవిత కోసం బాలోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. కళావేదిక కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో రాజారావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలలు కళారూపాలు ప్రదర్శించారు. జానపద కళల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అద్దంకి ప్రాంతంలో మూడు దశాబ్దాలుగా వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, డాన్స్ టీచర్ చింతపల్లి సుబ్బలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రముఖ మిజిషియన్ బి.వీ.రామన్ మ్యాజిక్ షో అలరించింది. కార్యక్రమంలో బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి, టీఎల్.కాంతారావు, ఎం.వెంకట్రావు, కూరపాటి పున్నారావు, జాగర్లమూడి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే దామచర్ల



ఉపాధ్యాయులకు అవార్డులను అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 8: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా యజమాన్యాలకు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏపీ ప్రైవేటు అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపస్మా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయంలో ఐదేళ్లపాటు ప్రైవేటు స్కూల్స్ అనేక ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. ప్రస్తుతం తాను ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని దామచర్ల భరోసా ఇచ్చారు. ప్రైవేటు టీచర్ల సమస్యల పరిష్కారానికి కూడా తాను ముందుంటానన్నారు. ప్రైవేటు పాఠశాలలు, టీచర్ల సమస్యల పరిష్కారానికి తమ అసోసియేషన్ కృషి చేస్తుందని అపస్మా జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు తెలిపారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే దామచర్ల ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ.సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు హనుమంతరావు, జిల్లాకార్యదర్శి మల్లికార్జునరావు, కోశాధికారి ఎంవీ.వెంకటేశ్వరరెడ్డి, రంగస్వామిరెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు : ఎస్పీ


తీరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తున్న ఎస్పీ దామోదర్

కొత్తపట్నం(ఒంగోలునగరం) సెప్టెంబరు 8: వినాయక నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అపశ్రుతులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. వినాయక నిమజ్జనాలకు అవసరమైన ఏర్పాట్లు కల్పించేందుకు ఆదివారం ఆయన కొత్తపట్నం పల్లెపాలెం తీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేషుడి విగ్రహాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా తీరానికి తరలిపోయేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తీరంలో చట వ్యతిరేక కార్యక్రమాలకు దిగేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నిర్ధేశిత సమయాల్లోనే నిమజ్జనానికి అనుమతించాలని కోరారు. భక్తులు సముద్రం లోతుకు పోకుండా హెచ్చరికలు చేయాలని, ప్రమాదవశాత్తూ ఎవరైన సముద్రం లోపలికి వెళితే వారిని వెంటనే బయటకు తెచ్చేందుకు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని కోరారు. అలాగే ఫ్లడ్‌లైట్లు, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు సిద్ధం ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం మెరైన్ పోలీసులు కూడా వినియోగించుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని అనేక ప్రాంతాల్లో నిమజ్జనం కార్యక్రమాలు జరిగే కాలువలు, నదులు వద్ద ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో తగిన బందోబస్తు, ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. అనంతరం గజ ఈతగాళ్లకు ప్రత్యేకంగా రూపొందించిన టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, టూ టౌన్ సీఐ శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సేవలో పొదుపు మహిళలు


విజయవాడ బయలుదేరి వెళుతున్న మహిళలు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 8: విజయవాడ బాధితులకు సేవలందించేందుకు ఒంగోలు నగర పొదుపు మహిళలు మేము సైతం అంటూ భాగస్వాములయ్యారు. గత వారం రోజులుగా కలెక్టర్ తమీమ్ అన్సారీయా నేతృత్వంలో నగరంలోని ఏ1 కన్వెన్షన్ హాలులో బాధితులకు ఆహారం పంపిణీ కార్యక్రమం చేపడుతుంగా, మెప్మా పొదుపు మహిళలు తమవంతుగా ఆ సేవల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నగర సీఎంఎం డి.కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం 50 బస్సుల్లో 150 మంది ఆర్పీలు, మరో 3వేల మంది పొదుపు మహిళలు విజయవాడ వెళ్లారు. అక్కడ వారికి ఆహారం అందజేయడంతోపాటు, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

వాతావరణ కాలుష్యంతో ఆరోగ్యానికి చేటు

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 8: వాతావరణ కాలుష్యంతో అందరి ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ నీలి ఆకాశం కోసం స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని ఒంగోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి చర్చిసెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణకు ప్రజలు తమవంతుగా కృషి చేయాలన్నారు. గాలిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పార్కులు అభివృద్ధి చేయడంతో పాటు రోడ్లను ప్రతి రోజు శుభ్రం చేస్తోందని చెప్పారు. ప్రతి ఇంటిలో మొక్కలు పెంచడం ద్వారా గాలిలో కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పర్యావరణ అనుకూల జీవనశైలి ద్వారా వాయు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రమండలి ఏఈ భాస్కర్‌వర్మ, ఎంహెచ్‌వో మనోహర్ రెడ్డి, సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, మేనేజరు శ్రీహరి, శానిటరీ ఇన్‌స్పెక్టరు షేక్ బాబ్జి, కార్యాలయ ఉద్యోగులు, సచివాయల సెక్రటరీలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

10,11 తేదీల్లో బేస్‌లైన్ పరీక్ష : డీఈవో

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 8 : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూలుప్లస్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10,11వ తేదీల్లో బేస్‌లైన్ పరీక్ష నిర్వహించాలని డీఈవో డి.సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం సబ్జెక్టుల్లో ఈ పరీక్షలు నిర్వహించాలి. బేస్‌లైన్ పరీక్ష విధివిధానాలు, శాంపిల్ పరీక్ష పత్రాలు ఇప్పటికే ఎంఈవో ఆఫీసు మెయిల్‌కు, వాట్సాప్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. నిర్దేశించిన తేదీల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఉప విద్యాధికారులు, ఎంఈవోలు, సెక్టోరల్ అ ధికారులు, స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఈ పరీక్షలను పర్యవేక్షించాలని డీఈవో సూచించారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

టంగుటూరు, సెప్టెంబరు 8 : టంగుటూరు పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్స్ అయిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ టి. చక్రపాణి ఓప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈ, బీటెక్ కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకు గరిష్టంగా నెలకు రూ.10వేల పారితోషికం ఉంటుందని, ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో సోమవారంలోగా అందజేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

18న ఒంగోలు జాతి పశువుల వేలం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 8: చదలవాడ పశుక్షేత్రంలోని ఒంగోలు జాతి పశువుల వేలం ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు క్షేత్రం డీడీ బి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి ఆవులు 10, ఒట్టి ఆవులు 13, పెయ్య దూడలు 13, కోడె దూడలు 20, కోడెలు 10కి వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా రూ.5వేల ధరావత్తు చెల్లించాలని, ఒక రోజు ముందుగా పశుక్షేత్రంలో వేలానికి ఉన్న పశువులను పరిశీలించుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9392901049 సెల్ నంబరులో సంప్రదించాలని డీడీ కోరారు.

ఒమ్మెవరంలో విరాళాల సేకరణ


విరాళాలను సేకరిస్తున్న టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 8 : ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు ఒమ్మెవరంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం రాత్రి విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలపర్తి బాలకోటి, కొమ్మాలపాటి సురేష్, పిన్నక వెంకటసుబ్బారావు, అల్లంనేని సుధీర్, నాగసాయి, కోట క్రాంతి, గోరంట్ల వీరప్పయ్య, నాగబాబు, కొమ్మాలపాటి రాముడు, పిన్నక సుబ్బారావు, సాయిరాం పాల్గొన్నారు.

22న ప్రైవేటు టీచర్లకు సన్మానం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 8: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఈనెల 22న సన్మానించనున్నట్లు ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల యజమానులు, ఉపాధ్యాయులు 9948912180, 9948600494 అవార్డుల కోసం సెల్‌నెంబర్లను సంప్రదించాలని అసోసియేషన్ నాయకులు చైతన్య, హరిబాబు, ప్రభాకర్‌రావు, కరీముల్లా, శ్రీనివాసరెడ్డి, శివ, బ్రహ్మయ్య కోరారు.

చెస్ చాంపియన్‌షిప్ విజేతలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 8 : ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని దాసరి మిని చెస్ హాస్‌లో ఆదివారం జిల్లాస్థాయి అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో విఘ్నేష్‌గుప్తా ప్రథమస్థానం, ఆదిత్య దత్తా ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో శ్రీలాస్య, శ్రీప్రియ ప్రథమ స్థానం, శ్రీసుదీక్ష ద్వితీయ స్థానంలో నిలిచారు. విజయనగరంలో ఈనెల 21,22వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ అబ్దుల్‌నబీ తెలిపారు. ఈ పోటీలను బి.సుకాంత్ పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

మద్దిపాడు, సెప్టెంబరు 8: రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం ఏడుగుండ్లపాడు హర్షిణి కాలేజీ వద్ద జరిగింది. అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న మోటార్‌సైకిల్‌కు కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి కింద పడింది. ఈ సంఘటనలో అద్దంకికి చెందిన ఆర్.సాంబశివరావు, సత్యవతిలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన


నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు, సెప్టెంబరు 8: గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద వినాయకుని నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్సై శివరామయ్య, మల్లవరం వీఆర్వో దీపక్ కుమార్ ఆదివారం పరిశీలించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద వినాయకుని విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు కొన్ని గ్రామాల వారు వస్తారని విద్యుత్, పంచాయతీశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. ఏవిధమైన అపశ్రుతులు లేకుండా సజావుగా కార్యక్రమం ముగిసేవరకు పర్యవేక్షిస్తామని, నిమజ్జన సమయంలో డీజే సౌండ్ బాక్సులు వాడకూడదని ఆయన పేర్కొన్నారు.

హాకీ జట్టు మేనేజర్‌గా రవికుమార్

సంతనూతలపాడు, సెప్టెంబరు 8 : ఏపీ జూనియర్ మెన్ హాకీ జట్టు మేనేజర్‌గా మండలంలోని మైనంపాడు జడ్పీహైస్కూల్లో పీఈటీ పనిచేస్తున్న టి.రవికుమార్ ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 19వ తేదీ వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే 14వ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు రవికుమార్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.

చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 8: ఒంగోలులోని రంగరాయుడు చెరువులో దూకి బేల్దారి పనులు చేసుకునే మాచేపల్లి సురేష్(35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఆదివారం ఉదయం మృతదేహాన్ని చెరువులోనుంచి బయటకు తీశారు. వివరాలలోకి వెళితే.. సంతనూతలపాడు మండలం తక్కెళ్ళపాడుకు చెందిన సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిత్యం ఒంగోలు వచ్చి బేల్దారి పనులు చేసుకొని వెళుతుంటాడు. ఈనెల 6న ఒంగోలు బేల్దారి పనుల నిమిత్తం వచ్చాడు. మద్యం సేవించే అలవాటు కూడా ఉంది. అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో తన అన్నకు ఫోన్ చేసి చార్జీకి డబ్బులు లేవని, రూ.200 ఫోన్‌పే చేయించుకున్నట్లు మృతుడి భార్య వెంకటేశ్వరి ఫిర్యాదులో పేర్కొంది. ఆ తరువాత సురేష్ ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం తన అన్న హరికృష్ణ ద్వారా తన భర్త చెరువులో దూకి మృతి చెందాడని తెలిసిందని వాపోయింది. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేఇ దర్యాప్తు చేస్తున్నారు.

260 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 8: ఎన్టీఆర్ యూత్, ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఎం.ముప్పాళ్ల గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మండవ పవన్‌కుమార్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు చిన్నం ప్రణీత్, సంహిత, రామాంజనేయులు, స్వాతి, సునీల్ వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 55 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు కిమ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫీ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల వాహనం



ఘటనాస్థలంలో ఉన్న వాహనాలు

సంతనూతలపాడు, సెప్టెంబరు 8: ఆర్టీసీ బస్సు, గ్యాస్ సిలిండర్ల వాహనం ఢీ ఒన్న సంఘటన ఆదివారం రాత్రి 8-30 గంటలకు సంతనూతలపాడులోని పెట్రోల్‌బంకు వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు, సంతనూతలపాడు నుంచి ఒంగోలు వెళ్తున్న గ్యాస్‌సిలిండర్ల వాహనం ముందున్న టిప్పర్‌ను అధిగమించబోయి దానినే ఢీకొట్టింది. అనంతరం ఒంగోలు నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ఘనసన్మానం

టంగుటూరు, సెప్టెంబరు 8 : ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన టంగుటూరు, జరుగుమల్లి మండలాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులంతా డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూటీఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సన్మానం పొందన ఉపాధ్యాయులు సేవలను కొనియాడారు. సన్మానం పొందిన వారిలో జగన్ మోహనరెడ్డి, ఎస్ఎస్ చక్రవర్తి, ఆదినారాయణ, జేవీ శేషయ్య, కె. విశ్వనాథ్, ఎస్ సుగుణకుమారి, ఎన్ హనుమంతురావు, ఎం రజని, బీ నరసింగరావు, బీ ప్రసాద్, ఎస్ సుబ్బారావు, ఎం ప్రేమకుమారి, జీ హనుమంతురావు ఉన్నారు. కే పూర్ణశ్రీ, ఎం సురేష్, పీ వెంకట్రావు, కే రమేష్ వీ బ్రహ్మయ్య, జిల్లా నాయకులు వీరాంజనేయులు, దామచర్ల శ్రీధర్‌బాబు, ఝాన్సీలక్ష్మీబాయ్, సులోచన పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించిన క్రీడాకారునికి మంత్రి అభినందన

టంగుటూరు, సెప్టెంబరు 8 : ఇంటర్‌నేషనల్ గేమ్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన గోపనబోయిన శ్రీనివాసరావును రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అభినందించారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తు పోటీల్లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. పతకాలు సాధించిన గోపనబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ నేపాల్‌లో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ ఇంటర్నేషనల్ గేమ్స్ 2024లో స్విమ్మింగ్‌లో పలు దేశాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కాగా, పొదిలి మండలం గోగినేనివారిపాలేనికి చెందిన శ్రీనివాసరావు 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో బంగారు పతకం, బ్రస్ట్ స్ట్రోక్ 100 మీటర్లలో బంగారు పతకం, బటర్ ఫ్లై స్ట్రోక్ 50 మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

సింగరాయకొండ : అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితమవ్వాలని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. శనివారం రాత్రి మండలంలోని శానంపూడి గ్రామంలో రామకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. కులం, మతంతో ప్రమేయం లేకుండా అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగం ప్రతి ఒక్కరి హక్కులను కాపాడుతోందన్నారు.

పోలేరమ్మ ఆలయంలో పూజలు

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 8 : కామేపల్లిలోని శ్రీపోలేరమ్మ ఆలయంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతోపాటు ఈప్రాంతానికి చెందిన ఇతర ప్రాంతాల్లో ఉంటున్న భవన నిర్మాణ కార్మికులు పోలేరమ్మను దర్శించుకున్నారు. పొంగళ్లుపెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ భక్తుల చేత ప్రత్యేక పూజలు చేయించారు.

ముప్పాళ్ల సొసైటీపై విచారణకు ఆదేశం

● డీసీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 8 : హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విచారణాధికారిగా డీసీసీ బ్యాంకు ఏజీఎం సుభానీని నియమించినట్లు చెప్పారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ముప్పాళ్లపాడు సొసైటీలో భారీ అక్రమాలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై డీసీవో వివరణ ఇచ్చారు. నివేదికను రెండు నెలల్లో సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించినట్లు తెలిపారు. అది అందగానే బాధ్యులపై సివిల్, క్రిమినల్, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, సెప్టెంబరు 5: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 8: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గోశాలలోని గోమాతలకు పూజాకార్యక్రమాలు చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహం తీసుకెళుతుండగా ప్రమాదం

» పలువురికి గాయాలు

దొనకొండ, సెప్టెంబరు 8: మండలంలోని దేశిరెడ్డిపల్లి గ్రామస్థులు శని వారం రాత్రి మార్కాపురం నుంచి ట్రాక్టర్‌లో పది అడుగుల భారీ గణేష్ విగ్రహం తీసుకెళుతుండగా దేవరాజుగట్టు బ్రిడ్జి వద్ద ప్రమాదానికి గుర య్యారు. దేవరాజుగట్టు వద్ద ట్రాక్టర్‌ను లారీ వెనుకవైపు నుండి ఢీ కొట్ట డంతో ట్రాక్టర్ బోల్తాకొట్టింది. ఈప్రమాదంలో గ్రామానికి చెందిన నాగిరెడ్డి కోటిరెడ్డి, బ్రహ్మారెడ్డి, వనమాల అచ్చిరెడ్డి, మొద్దుల వెంకటరెడ్డి, గోపిరెడ్డి, దేశిరెడ్డి శివారెడ్డి, చిలకల అవినాష్‌రెడ్డి, టి.వెంకటరెడ్డి తీవ్రగాయాలపా లయ్యారు. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి అచ్చిరెడ్డిని మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. స్వల్పగాయాలైన వారికి మార్కాపురం లో వైద్యసేవలందించారు. రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఎస్పీ దామోదర్ గ్రామంలో వేడుకలు జరిగేలా గణేష్ విగ్రహం, పూజా సామగ్రి ఏర్పాటుచేయాలంటూ త్రిపురాంతకం సీఐకి ఆదేశాలు జారీచే శారు. దీంతో ఆయన శనివారం ఉదయం గణేష్ విగ్రహం, పూజా సామ గ్రిని గ్రామానికి పంపటంతో వేడుకలు నిర్వహించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవటంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకు న్నారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హుటాహుటీన నర్సరావుపేట వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైసీపీ నాయకులు కాకర్ల కృష్ణారెడ్డి, బీఎస్ రాజు, గుమ్మా వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

గణేష్ పూజలో మంత్రి స్వామి

సింగరాయకొండ, సెప్టెంబరు 8 : సింగరాయకొండలోని ఆర్యవైశ్య గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వజ్రాల వినాయకుడి విగ్రహం వద్ద రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శని వారం రాత్రి పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకుడు గోత్రనామాలు చదివి స్వామికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.


చతుకుపాడులో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పూజ చేస్తున్న అర్చకుడు

గణనాథులకు ప్రత్యేక పూజలు

కొండపి : వినాయక చవితి సందర్భంగా వాడవాడలా గణేష్ మండపాలు ఏర్పాటయ్యాయి. ఆయా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లో ఆయా కులాలు, పార్టీలు, బజార్లు వారీగా కూడళ్లలో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. వసతిని బట్టి 9 రోజుల వరకు మండపాల్లో పూజలు చేసి అనంతరం గణనాథులను నిమజ్జనానికి తరలిస్తారు. ఈసందర్భంగా మండపాల వద్ద భజనలు, కోలాటాలు, సాంఘిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


పూజలో పాల్గొన్న మంత్రి స్వామి

మర్రిపూడిలో..

మర్రిపూడి : మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక చవితి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో వినాయకుని ప్రతిమలను ఉంచి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గణేశ మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మండలంలో 74 విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందాయని, మరో 15 విగ్రహాలు అనధికారికంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.


మర్రిపూడిలో పూజలందుకుంటున్న గణనాథుడు

గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్ల

కృష్ణసాయి గ్రానైట్‌లో కూలిన హైవాల్

కేసు నమోదు చేసిన పోలీసులు

నేడు పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 8 : గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. నిబంధనలు తుంగలో తొక్కి యాజమాన్యాలు ఇష్టానుసారం రాయిని తవ్వుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా లోపించడంతో క్వారీల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటి నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడంతో కార్మికుల పరిస్థితి దినదినగండంలా మారింది. 2009లో చీమకుర్తి సమీపంలోని హంసా గ్రానైట్‌లో హైవాల్ కూలి 14 మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి భద్రతాచర్యలు కట్టుదిట్టం చేశారు. అయినప్పటికీ కొందరు క్వారీ యాజమానులు తవ్వకాల విషయంలో నిబంధనలు పాటించడం లేదు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఈనేపథ్యంలోనే ఈనెల 5వతేదీ తెల్లవారుజామున రామతీర్థం వద్ద ఉన్న కృష్ణసాయి గ్రానైట్ క్వారీలో హైవాల్ కూలింది. ఆసమయంలో అక్కడ అసలు పనులు చేయడం లేదని యాజమాన్యం చెప్తోంది. సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్పీ దామోదర్ అక్కడ నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు కృష్ణసాయి గ్రానైట్స్ క్వారీ యజమానుల పై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనేక ఆరోపణలు

ఓరియంట్ క్వారీని కృష్ణసాయి గ్రానైట్స్ యాజమాన్యం లీజుకు తీసుకుంది. 2006 ఏప్రిల్ నుంచి 2023 మే వరకు ఆ కంపెనీకి లీజు అనుమతులు ఉన్నాయి. తిరిగి మరలా లీజుకు తీసుకునేందుకు మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ క్వారీయింగ్ చేస్తున్నారని అధికారులకు కొందరు ఫిర్యాదులు చేశారు. దీంతో ఈనెల 4న మైన్స్ సేఫ్టీ డీడీ జ్ఞానేశ్వర్ తన సిబ్బందితో కృష్ణసాయి గ్రానైట్‌ను పరిశీలించారు. ఆ మరుసటి రోజే హైవాల్ కూలిపోవడం గమనార్హం. ఇలా అనేక క్వారీలలో వాల్స్‌కు బెంచ్ కటింగ్ లేకుండా తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వారీయింగ్‌లో ప్రతి 7 మీటర్లకు ఒక బెంచ్ కటింగ్ పెట్టాలి. అందుకు విరుద్ధంగా తవ్వకాలు చేయడం వల్లనే ఇలా క్వారీల గోడలు కూలి ప్రమాదాలు జరుగుతున్నాయి.



కృష్ణసాయి యాజమాన్యంపై కేసు నమోదు

కృష్ణసాయి గ్రానైట్ యజమాన్యంపై చీమకుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వారికి సంబంధించిన క్వారీలో హైవాల్ కూలి పడిపోయింది. ఈమేరకు ఆప్రాంత వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఏమైనా ప్రాణనష్టం జరిగిందా అన్న కోణంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సాయత్రం హుటాహుటిన క్వారీని పరిశీలించిన తరువాత పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

నేడు క్వారీని పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

కృష్ణసాయి గ్రానైట్‌లో ప్రమాదం జరిగిన క్వారీని మైనింగ్ శాఖ భద్రతాధికారులు సోమవారం పరిశీలించనున్నారు. అక్కడ ప్రస్తుతం క్వారీయింగ్‌కు అనుమతులు లేవు. ఏడాది క్రితం పనులు నిలిపి వేసినట్లు యాజమాన్యం చెప్తోంది. అలాంటప్పుడు గోడ ఎలా కూలిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 8: కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉండే వివిధ విభాగాల విధానాలపై ఎమ్మెల్యే ఆసుపత్రి వైద్యులకు ఫొటోలు చూపించి వివరించారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోగులకు నిత్యం వైద్యసేవలు అందించాలన్నారు. ఆసుపత్రుల్లోని అన్ని విభాగాల్లో వైద్య సేవలపై ఎమ్మెల్యే వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), ఎస్ఐ త్యాగరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వర్షాలకు ఛిద్రమైన రోడ్లు

» ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

దర్శి, సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన వర్షాలకు అనేక రోడ్లు ఛిద్రమయ్యాయి. రోడ్లపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో అనేకచోట్ల గుంతలలో నీరు నిల్వఉండటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డులో కంకర, తారు లేచిపోయింది అనేకచోట్ల రోడ్లు గుంతలమయమయ్యాయి. రాజంపల్లి- బొద్దికూరపాడు రోడ్డు రైల్వేలైన్ వద్ద దెబ్బతింది. గ్రామీణ ప్రాంతాల్లో అనేకచోట్ల రోడ్లు ఛిద్రం కావటంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు రోడ్ల దుస్థితి గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దర్శి - తూర్పుగంగవరం మార్గంలో బొట్లపాలెం వద్ద రోడ్డుపై పడిన గుంత


అధ్వానంగా పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు

చీరాల ప్రజలకు అండగా ఉంటాం

● ఎంపీ కృష్ణప్రసాద్


జరీ కండెలను పరిశీలిస్తున్న ఎంపీ దంపతులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : చీరాల ప్రజలకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. ఎంపీ కృష్ణప్రసాద్ సతీమణి శిరీషతో కలిసి ఆదివారం చీరాలలో విస్తృత పర్యటన చేశారు. ముందుగా సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొని, అక్కడి నూతన నిర్మాణాలను పరిశీలించారు. వేటపాలెం మండల పరిధి ఆమోదగిరిపట్నంలోని వినాయక మండపాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నవితరణ చేశారు. సమీపంలోని ఓ చేనేత కుటుంబం నిర్వహిస్తున్న జరీ కండెలను పరిశీలించి, వానలతో మగ్గం సాగడం లేదని తెలుసుకున్న ఎంపీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట టీడీపీ నాయకురాలు సజ్జా హేమలత, కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ ఆడిట్ అధికారి రాజశేఖర్‌పై దాడి

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 8 : కోఆపరేటివ్ ఆడిట్ అధికారి కొలిశెట్టి రాజశేఖర్‌పై కొందరు ఆగంతుకులు దాడి చేశారు. ఈ ఘటన స్థానిక అంబేడ్కర్ భవన్ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రాజశేఖర్ ఇంటికి వెళ్తుండగా రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వ్యక్తులు ఆయన్ను అనుసరించారు. అంబేడ్కర్ భవన్ సమీపంలోకి వెళ్లే సరికి ఒక్కసారిగా ఆయన కళ్లల్లో కారం కొట్టారు. అనంతరం కర్రలతో దాడి చేసి పరారయ్యారు. రాజశేఖర్ కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు ఆసుపత్రికి వెళ్లి విచారణ చేపట్టారు. ఇది కిరాయిహంతకుల పని అయి ఉంటుందని అనుమానిస్తున్నారు.

వినాయక విగ్రహంపై వైసీపీ గేలి

● ఆపై టీడీపీ వర్గీయులపై దాడి

● పెట్లూరులో ఘటన.. ఒకరికి గాయాలు

కొండపి, సెప్టెంబరు 8 : మండలంలోని పెట్లూరు గ్రామంలో వినాయకుడి విగ్రహాన్ని టీడీపీకి చెందిన ఎస్సీ కాలనీవాసులు మండపం కట్టి ఏర్పాటు చేశారు. దీనికి చందాలు వసూలు చేశారు. ప్రత్యర్థి వర్గానికి చెందిన వైసీపీ యువకులు మద్యం తాగి అడుక్కుని వినాయకుడి బొమ్మ పెడతారా? అని గణేషుడి బొమ్మ ఏర్పాటు చేసిన కార్తీక్ అనే యువకుడిని శనివారం రాత్రి ఎగతాళి చేశారు. ఆ యువకుడు విషయాన్ని తన అక్క అరుణకు, వారి బంధువులకు చెప్పాడు. గేలి చేయడం ఎందుకు అని ఆదివారం ఉదయం కార్తీక్, అరుణ మరికొందరు గేలి చేసిన యువకులను అడగడానికి వెళ్లగా అక్కడే వారిపై వైసీపీ వర్గానికి చెందిన యువకులు దాడి చేశారు. దీంతో గాయపడిన అరుణ కొండపి సీహెచ్‌సీలో వైద్యసాయం కోసం చేరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెట్లూరు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కోటి రత్నం కొడుకు, తంగెళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి అయిన ఆరెతోటి శ్రీను పాటు మరో పదిమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఆరెతోటి అరుణ

ప్రశాంతంగా పండుగ జరుపుకోండి

టంగుటూరు, సెప్టెంబరు 8 : మద్యానికి దూరంగా ఉండి ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని వినాయక విగ్రహ కమిటీల సభ్యులకు ఎస్సై నాగమల్లేశ్వరరావు సూచించారు. వినాయక చవితి పండుగ వేడుకల్లో గతంలో వివాదాలు చెలరేగిన మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం, కారుమంచి, పొందూరు గ్రామాల వినాయక విగ్రహాల కమిటీలను ఎస్సై పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పలు సూచనలు చేశారు. అవకాశం చూసుకొని విగ్రహాల ప్రదేశంలో సీసీ కెమెరాలు పెడితే రాత్రివేళ్లలో మీరు కాపలాగా అక్కడే పడుకోవాల్సిన పని కూడా ఉండదన్నారు. పోలీస్ అనుమతి లేకుండా విగ్రహ మండపం వద్ద ఎలాంటి కార్యక్రమాలకు అనుమతివ్వబోమన్నారు.

ఊరచెరువులో జారిపడి వృద్ధురాలు మృతి


అచ్చమ్మ (ఫైల్)

టంగుటూరు, సెప్టెంబరు 8 : టంగుటూరు నడిబొడ్డునున్న ఊరచెరువులో జారి పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు అరుంధతీనగర్‌కు చెందిన వృద్ధురాలు శిఖా అచ్చమ్మ(80) మతిస్థిమితం కోల్పోయింది. కుటుంబ సభ్యులు ఎవ్వరికీ తెలియకుండా ఆమె శనివారం ఉదయం ఊరచెరువు వద్దకు చేరుకుంది. చెరువులో జారి పడి మృతి చెందింది. ఎస్ఐ నాగమల్లేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గజ ఈతగాళ్లను పిలిపించి మృతదేహాన్ని వెలికితీయించారు. సంఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వినాయక ఉత్సవాల్లో అపశ్రుతి

● టపాసులు పడి ముగ్గురు చిన్నారులకు గాయాలు


చికిత్స పొందుతున్న చిన్నారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : రామాపురంలో వినాయక ఉత్సవాల్లో అపశ్రుతి ఏర్పడింది. దీంతో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకా రం.. గ్రామంలో పెద్ద బ్యాచ్, చిన్న బ్యాచ్ అని పిలుచుకుంటున్న రెండు వర్గాలకు సంబంధించి గతంలో పలు కేసులు ఉన్నాయి. ఇటీవల పోలీసులు, నాయకుల సహకారంతో కొంత మేరకు గ్రామం లో పరిస్థితులు చక్కబడ్డాయి. ఆదివారం ఉదయం జరిగిన ఘటన మరలా వివాదానికి దారి తీసింది. పెద్ద బ్యాచ్ ఆదివారం గణేష నిమజ్జనం ముగించుకుని ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో చిన్నబ్యాచ్‌కు సంబంధించిన వినాయకుని ఉత్సవాల్లో టపాసులు పేల్చారు. ఆ సమయంలో పెద్దబ్యాచ్ వారు పరుగులు తీసి పక్కకు వెళ్లారు. కానీ అదే బ్యాచ్‌కు చెందిన చిన్నపిల్లలు పొన్నపూడి లాస్య, వాయిల యమున, కుర్రు అనూరాధ టపాసులు తగిలి శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ క్షతగాత్రులను 108లో చీరాల ఏరి యా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. సీఐలు సత్యనారాయణ, శ్రీనివాసరావు హాస్పిటల్‌కు వెళ్లి పరిశీలించారు. విషయంపై ఆరా తీశారు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. ఘటనపై గడియార స్తంభం కూ డలి వద్ద బాధితులు ఆందోళన చేసేందుకు సమాయత్తమయ్యారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారికి సర్ది చెప్పి పంపారు.

భక్తిశ్రద్ధలతో వినాయకచవితి

● వాడవాడల మండపాల ఏర్పాటు ● కమిటీల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ● కంభం చెరువులో నిమజ్జనాలు




మార్కాపురం మెయిన్‌బజార్, తూర్పువీధిలోని వినాయకుడు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో వివిధ వీధులలో గణనాథులు కొలువుదీరారు. రథంవీధిలోని వినాయక స్వామి ఆలయంలో పూజలు, హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. రథంబజార్, తూర్పువీధి, శివాలయం, ఆంజనేయ స్వామి గుడి, అలుగు బజార్, నెహ్రూ బజార్, జవహర్ నగర్ కాలనీ, కోనేటి వీధిలతో పాటు వాడవాడలా గణేష్ మండపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.

కంభం చెరువు వద్ద నిమజ్జనాలు

కంభం, : చారిత్రాత్మక కంభం చెరువులో వినాయక నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు భక్తుల కోలాహలం మధ్య నిమజ్జన వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి భారీ విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. చెరువుకట్టపైకి వెళ్లే దారి, పట్టణంలోని ప్రధాన రోడ్డుపై భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. దర్శి డీఎస్పీ నరసింహులు ఆధ్వర్యంలో శాంతిభద్రతలు పర్యవేక్షించారు.




కంభం చెరువులో నిమజ్జనం

ముత్తుముల విఘ్నేశ్వర్‌రెడ్డి విశేషపూజలు

కంభం: కంభం మండల టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఆహ్వానం మేరకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి, ఆయన కుమారుడు విఘ్నేశ్వర్‌రెడ్డిలు కందులాపురం కూడలిలో, చౌకొసెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపాలలో గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శుభకార్యం మొదలు పెట్టేటపుడు ప్రథమ పూజలు అందుకునే వినాయకుడినే పూజిస్తామన్నారు. కాగా వినాయక మండపాలలో టీడీపీ నాయకులు కేతం శ్రీను, కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాటకచేరి, సినీనటులు నందమూరి తారక రామారావు, బాలకృష్ణ, చిరంజీవి, జూనియర్ ఎన్‌టీఆర్, పవన్‌కళ్యాణ్ వేషధారణలో వేసిన నృత్యాలు భక్తులను అలరించాయి.

ఆకట్టుకున్న బాలాపూర్ మినీ గణేశుడు

బేస్తవారపేట : బేస్తవారపేటలోని నెహ్రూనగర్‌లోని వినాయకుడి విగ్రహం విశేషంగా ఆకట్టుకొంది. హైదరాబాద్‌లోని బాలాపూర్ విగ్రహ నమోనాలో వినాయకుడిని ఏర్పాటు చేశారు. గణేశుని విగ్రహ కనురెప్పలు కదులుతూ, తలపై శివుని విగ్రహం కదులుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వాడవాడలా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా, ఆదివారం పలు విగ్రహాలను కంభం చెరువులో నిమజ్జనం చేశారు.



బాలాపూర్ మినీ గణేశుడు

త్రిపురాంతకం : మండలంలో వాడవాడల వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. త్రిపురాంతకంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో, శ్రీరామ నగర్, ఉత్తరపు బజారు, భారతీ పాఠశాల, పాత రామాలయం, కోదండ రామాలయం, బ్రహ్మంగారికాలనీ, పాత పోలీసు స్టేషను బజారులలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. పలుచోట్ల నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి.

కంభం చెరువు వద్ద పటిష్ట బందోబస్తు

కంభం, సెప్టెంబరు 8: వినాయక చవితి పర్వదినం అనంతరం ఆదివారం కంభం చెరువులో జరిగే నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దర్శి డీఎస్పీ నరసింహులు ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 200 మంది కానిస్టేబుళ్లు, ఆర్మ్ రిజర్వ్ పోలీసులు, 100 మంది హోంగార్డులు బందోబస్తు నిర్వహించారు. కంభం చెరువులో 10 అడుగుల మేర నీరు ఉన్నందున నిమజ్జన సమయంలో గజ ఈతగాళ్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కూడా లైట్లను ఏర్పాటు చేసి నిమజ్జనాలు పూర్తి చేయనున్నారు.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి విశేష పూజలు

గిద్దలూరుటౌన్ : వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి శనివారం స్వామి వారిని పలు అలంకరణలలో నిలిపి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి పలు మండపాలలో శనివారం రాత్రి స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, పొట్టిశ్రీరాములు వీధి, షరాఫ్‌బజారు, ఎల్‌ఐసీ ఆఫీసు వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లోని గణనాథులను ఎమ్మెల్యే అశోకొరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అశోకొరెడ్డి మాట్లాడుతూ బుద్ధిని, జ్ఞానాన్ని ప్రసాదించే వినాయకుని ఆశీస్సులు నియోజక వర్గ ప్రజలపై ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాలలో టీడీపీ నాయకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నా రు. ఈసందర్భంగా మండపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అర్బన్ సీఐ కె.సురేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తర్లుపాడు : వినాయక చవితి పర్వదినం సందర్భంగా మండలంలో 48 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. గణేష్ విగ్రహాల వద్ద విద్యుత్ దీపాలతో పందిర్లు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో 3, 5, 9రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించి నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తర్లుపాడులోని ఆర్యవైశ్య సంఘం, రెడ్డి, యాదవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలను 5వ రోజు నిమజ్జనం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విగ్రహాల వద్ద భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ మండపాల వద్ద భారీ స్థాయిలో అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కశ్శెట్టి జగన్‌బాబు, జోగిపర్తి మల్లికార్జునరావు, గిరి, ఉదయగిరి సుబ్రహ్మణ్యం భక్తులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండల కేంద్రం దోర్నాలలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం, విజయగణపతి దేవాలయం, వడ్డేవారి వీధి, ఒకటవ వార్డు, పాత పెట్రోలు బంకు వద్ద, వెచ్చా వెంకటసుబ్బయ్య వీధి, సుందరయ్య కాలనీలతో పాటు పలు వీధుల్లో తిమ్మాపురం శ్రీ చౌడేశ్వరీ దేవాలయంలో గణేశుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. నవరాత్రుల్లో భాగంగా ఆదివారం రెండోరోజు ఆయా ఆలయాల ప్రధాన అర్చకులు గణనాథున్ని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గిద్దలూరులో పూజలు చేస్తున్న భక్తులు

కొమరోలు: కొమరోలులోని వినాయకుడి గుడి ఆవరణలో భక్తుల సమక్షంలో వేదపండితుల నడుమ శ్రీ సిద్ధి, బుద్ధిలతో వినాయకుని కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక వినాయకగుడిలోని ప్రతిమ, చెక్‌పోస్టులోని మట్టి గణనాథుని ప్రతిమ, చాకలి బజారు, ఆర్యమరాఠీకాలనీ, సిమెంటుకొట్టు వెంకటరెడ్డి బజార్, రెడ్డిబజార్, నాయిబ్రాహ్మణ బజారులోని విగ్రహాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.చెక్‌పోస్టు సమీపంలోని మట్టివినాయకుని వద్ద రాత్రి పాటకచేరి కార్యాక్రమాన్ని నిర్వహించారు.

పొదిలి : మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక చవితి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ గ్రామాన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో వినాయకుని ప్రతిమలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తలను అలరించాయి. గణేశ్ నిమ జ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ వేమన తెలిపారు.



పొదిలిలో వినాయకునికి పూజలు






కంభం చెరువుకు నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, కంభం మండలంలో సినీనటుల వేషధారణలో కళాకారులు, త్రిపురాంతకంలో విశేష పూజలు, తర్లుపాడులో భక్తులకు అన్నదానం

సాగర్ కాలువలో పడి యువకుడి మృతి

త్రిపురాంతకం, సెప్టెంబరు 8: సాగర్ కాలువలో ఈత కోసం వెళ్లిన యువకుడు గల్లంతై మృతి చెందిన ఘటన మండలంలోని ఎండూరివారిపాలెంలో శనివారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకటనారాయణ(27) స్నానం చేసేందుకు గ్రామ సపమీపంలోని సాగర్ కుడి కాలువలో దిగాడు. అయితే ఈత రాకపోవడంతో ప్రవాహంలో గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం ఇచ్చారు. వారి సాయంతో కాలువలో వెతుకులాడారు. గల్లంతైన యువకుడి మృతదేహం త్రిపురాంతకం సమీపంలో వంతెన వద్ద గుర్తించారు. పోలీసులు, కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహానికి వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

గిద్దలూరు, సెప్టెంబరు 8 : గిద్దలూరు పట్టణానికి చెందిన పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగి అద్దంకి సుదర్శన్ (25) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్నేహితుని జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కొమరోలు మండలం తాటిచెర్లమోటుకు వెళ్లి మోటార్ సైకిల్‌పై రాత్రి సమయంలో గిద్దలూరు వస్తున్నాడు. వాహనం అదుపుతప్పి యడవల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. సుదర్శన్‌కు తల్లి, భార్య, 3 నెలల కుమారుడు ఉన్నారు. రాచర్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తర్లుపాడు ఎస్‌ఐగా రాజ్‌కుమార్

తర్లుపాడు, సెప్టెంబరు 8: తర్లుపాడు ఎస్‌ఐగా టి.రాజ్‌కుమార్ శనివారం రాత్రి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు గుంటూరు జిల్లా పెదనందిపాడు ఎస్‌ఐగా పనిచేస్తూ, బదిలీపై తర్లుపాడు వచ్చారు. ఈ సంద ర్భంగా ఎస్‌ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు పరిరక్షణకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ఎస్‌ఐని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి అభినం దించారు.



బాధ్యతలు చేపడుతున్న ఎస్సై

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మార్కాపురం, సెప్టెంబరు 8: బైక్ వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి ఓ వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం రాత్రి ఎస్టేట్‌లో చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు, మండలంలోని గొట్టిపడియ గ్రామానికి చెందిన నవయ్య అనే వ్యక్తి మరొకరితో కలిసి బైక్‌పై రాయవరం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎస్టేట్ వద్ద తన చికెక్ దుకాణం ముందు నిలబడివున్న రిజ్వాన్ అలీబేగ్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో రిజ్వాన్, నవయ్యలకు తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇరువురిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ప్రాథమికచికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం రిజ్వాన్‌ను గుంటూరు, నవయ్యను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిరుద్యోగి నిజాయితీ

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 8: దోర్నాలలోని ఓ పెట్రోలు బంకులో చిరుద్యోగిగా పనిచేస్తున్న వెంకటేష్ అనే యువకుడు నిజాయితీ చాటుకున్నాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్ సాహు ఆదివారం తన కారులో శ్రీశైలం దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమ య్యాడు. స్థానిక పెట్రోలు బంకులో కారుకు పెట్రోలు పోయించుకునే క్రమంలో బ్యాగును అక్కడే మరిచి వెళ్లి పోయాడు. బంకులో పనిచేస్తున్న వెంకటేష్ ఆ బ్యాగును గమనించి పోలీసుస్టేషనులో సీఐకి అప్పగించాడు. బ్యాగును పరిశీలించగా సెల్‌ఫోన్, ఏటీఎం, ఐడెంటిటీ కార్డులున్నాయి. సీఐ ప్రభాకరరావు మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్‌కు విషయం తెలిపారు. చిరునామా తెలుసుకుని కొరియర్ ద్వారా పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ను సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

తపాలా శాఖ ఉద్యోగుల సమస్యలపై దృష్టి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8: తపాలా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జాతీయ స్థాయిలో కృషి చేస్తామని నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మార్కాపురం డివిజన్ నేషనల్ యూనియన్ ఆఫ్‌పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు తిరుపాలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న జీడీఎస్ టాప్‌గ్యాప్ వేతనాలు, స్టేషనరీ సామగ్రీ, అపరిమిత టార్గెట్, ఓపెనింగ్ సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఓపీఎస్ సాధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మార్కాపురం డివిజన్ ఎస్పీ జీవీ.శ్రీనివాసులు మాట్లాడుతూ తమస్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి డేవిడ్‌రాజు, అధ్యక్షులు కృష్ణ ప్రసాద్‌లు మాట్లాడుతూ సర్కిల్ లెవెల్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు. స్టేట్ పోస్ట్‌మెన్ అండ్ ఎంటీఎస్ సర్కిల్ సెక్రటరీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ పోస్ట్‌మెన్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీడీఎస్ సెక్రటరీ యోగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జేఆర్‌కే కుమార్, వెంకారెడ్డి, మార్క్, డివిజన్ నాయకులు తిరుపాలు, శశిధర్‌రెడ్డి, షాకీర్, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, అబీబ్ బాషా, హమ్‌జా నాయక్, ఈస్టర్ పాల్, నారాయణరెడ్డి, పూలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి శివాజీ

ఆర్టీసీ డిపోను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 8 : గిద్దలూరు ఆర్టీసీ డిపోను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి అన్నారు. డిపో ఆవరణలో ఆదివారం నాలుగు నూతన బస్సులను ఆయన ప్రారంభించారు. బస్సులను రిబ్బన్ కట్ చేసి జెండా ఊపారు. అనంతరం ఆయన బస్సును కొంతదూరం నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోకొరెడ్డి మాట్లాడుతూ 1977లో గిద్దలూరు ఆర్టీసీ డిపో ఏర్పడిందన్నారు. అప్పట్లోనే గిద్దలూరు డిపో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నదన్నారు. గతంలో ఆదాయంలో జిల్లాలోనే రెండవ స్థానంలో ఉన్న గిద్దలూరు డిపో ప్రస్తుతం వెనుకబడిందన్నారు. 84 బస్సులు ఉన్న డిపోలో ప్రస్తుతం 73 బస్సులు ఉన్నాయన్నారు. త్వరలో డిపో అభివృద్ధికి కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, డిపో మేనేజర్ బత్తుల చంద్రశేఖర్, పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు లొక్కు రమేష్, చంద్రశేఖర్‌యాదవ్, గడ్డం భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల మద్దతు మరువలేనిది

గత ఎన్నికలలో మీరు చూపిన ఆదరాభిమానాలు, మీరు ఇచ్చిన మద్దతు మరువలేనిదని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ అభినందన సభకు ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ ఎన్‌డీఏ కూటమి విజయంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర ప్రధానమైనదన్నారు. ఈ సందర్భంగా మూడు మండలాలకు చెందిన ఉద్యోగులు ఎమ్మెల్యే అశోకొరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు, కావడి వెంకటేశ్వర్లు, ఉద్యోగసంఘం నాయకులు ప్రసాద్, శర్మ, దుత్తా బాలీశ్వరయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలపార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు, కటికె యోగానంద్, ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పిడతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణలో భారత రాజ్యాంగం ప్రాముఖ్యత' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు గెలిచిన విజేతలకు ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విజేతలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి విశ్వభారతి పాఠశాల విద్యార్థిని బి.సునయన, రెండవ బహుమతి గీతాంజలి పాఠశాల విద్యార్థి కె.యశ్వంసరెడ్డి, మూడవ బహుమతి వినూత్న పాఠశాల విద్యార్థిని కె.నిహారిక, అనూస పాఠశాలకు చెందిన కె.దీపికఅనూష, అలాగే ప్రభుత్వ పాఠశాలలో మొదటి బహుమతి ఎం.ఖుషి, రెండవ బహుమతి కె.షబ్నం, జూనియర్ కళాశాలలో సాహితి కళాశాలకు చెందిన టి.దీవెన, సాయిచైతన్య కళాశాలకు చెందిన ఎం.లక్ష్మీ మొదటి, ద్వితీయ బహుమతులు, కన్సొలేషన్ బహుమతులుగా సాయిటెక్నో స్కూల్‌కు చెందిన షేక్ అసఫ్, అరుణోదయకు చెందిన షేక్ సల్మాన్, సూర్య విద్యానికేతన్‌కు పి.మానసలక్ష్మీలు బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో పిడతల ఫౌండేషన్ సీఈవో పిడతల రమేష్‌రెడ్డి, పాఠశాలల కరస్పాండెంట్లు నాగభూషణ్‌రెడ్డి, స్వరూపారెడ్డి, కొండారెడ్డి, రామిరెడ్డి, బాదుల్లా, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పొదిలి, సెప్టెంబరు 8 : జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డులు సాధించిన మాదిగ ఉపాధ్యాయులను ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం జూనియర్ కళాశాలలో ఎంఈఎఫ్(మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షులు ఐజాక్‌మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాదిగ ఉద్యోగులు సంఘం అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయునికి నిజమైన గెలుపు వచ్చినట్లు అన్నారు. మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు అందాలంటే రానున్న తరం వారు బాగా చదువుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యాభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులందరూ జాతికోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంఈఎఫ్ ఉద్యోగులు ఎంఆర్‌పీఎస్ ఉద్యమాన్ని బలపరచాలని అన్నారు. అందరు కష్టపడితేనే వర్గీకరణ ఫలాలు వచ్చాయన్నారు. కనుక ప్రతిఒక్కరు వర్గీకరణ కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఆర్‌ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లగుంట్లలో దొంగలు హల్‌చల్

● 13 తులాల బంగారం, వెండి చోరీ

కొమరోలు, సెప్టెంబరు8: కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలోని రెండు గృహాల్లో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు నల్లగుంట్ల ఎంపీటీసీ సభ్యులు చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి నివాసంలో, పక్కనే ఉన్న బోడ్డు వెంకటసుబ్బయ్యల నివాసంలో చోరీ జరిగింది. ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి వారి భార్య పిల్లలు ఇంటి వెనుక ఉన్న గదిలో నిద్రించారు. వారు ఉన్న గది తలుపులు గడియపెట్టి, ముందు ఉన్న గదిలోని బీరువా, షెల్ఫ్‌లను వెతికారు. ఇంట్లోని విలువైన వస్తువులను తీసుకెళ్లారు. ఉదయం వెంకటేశ్వరెడ్డి లేచి చూడగా గదుల్లోని వస్తువులు చెల్లచెదురుగా పడి ఉన్నాయి. గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మధుసుదన్‌రావు తన సిబ్బందితో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మార్కాపురం క్లూష్ టీంకు తెలియపర్చారు. వారు చోరీకి గురైన పరిసరాలను పరిశీలించి శాంపిల్స్‌ను తీసుకున్నారు. చోరీకి గురైన ప్రదేశాలను పరిశీలించిన పోలీసులకు బాధితుడు వెంకటేశ్వరెడ్డి 12తులాలు బంగారు వస్తువులు, 7తులాలు వెండి, సుమారు10వేల నగదు పోయినట్లు తెలిపారు. మరో గృహం బోడ్డు సుబ్బయ్య ఇంట్లో కమ్మలు, మాటీలు ఒక తులం బంగారు వస్తువులు పోయినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఎస్సై మధుసుదన్‌రావు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ..

పలు రైళ్లు రద్దు

గిద్దలూరు, సెప్టెంబరు 8 : గిద్దలూరు-దిగువమెట్ట మధ్యలో రైల్వే డబ్లింగ్ పనుల కారణంగా పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. గుంటూరు-కాచీగూడ (17251), గుంటూరు-డోన్ (17228) రైళ్లను ఈనెల 11 నుంచి 20వ తేది వరకు రద్దు చేశారు. కాచీగూడ-గుంటూరు (17252), డోన్-గుంటూరు (17227) రైళ్లను ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు రద్దు చేశారు. గుంటూరు-తిరుపతి (17261) రైలును ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు, తిరుపతి-గుంటూరు (17262), గుంటూరు-ఔరంగబాద్ (17253) రైళ్లను ఈనెల 18 నుంచి 21వ తేది వరకు, ఔరంగబాద్-గుంటూరు (17254) రైలును ఈనెల 19 నుంచి 22వ తేది వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

నిత్యావసర వస్తువులు అందజేత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న పూర్వవిదార్థులు

గిద్దలూరు, సెప్టెంబరు 8 : పట్టణంలోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలకు చెందిన 1983-88 పూర్వ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని సంజీవిని అనాథ వృద్ధాశ్రమానికి, అమ్మ వృద్ధాశ్రమానికి, మానసిక దివ్యాంగుల పాఠశాలకు నిత్యవసర వస్తువులను అందజేశారు. ఆశ్రమాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన దాతలు పామూరి శ్రీనివాసరెడ్డి, పిడతల సురేష్‌రెడ్డి, టి.వెంకటరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు జి.తులసిబాబు, కాశయ్య, అలసందలపల్లి శ్రీనివాసులు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అక్షరజ్ఞానంతో తొలగనున్న అంతరాలు

పొదిలి, సెప్టెంబరు 8 : అక్షరజ్ఞానంలో సమాజంలో అంతరాలు తొలుగుతాయని వయోజన విద్య రాష్ట్ర పూర్వసంయుక్త సంచాలకులు గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 58వ అంతర్జాతీర అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. అక్షరజ్ఞానం ఉంటే ఎవరైనా ఎంతటి వారైనా సమాజంలో ఉన్నత విలువలు కలిగి ఉంటారన్నారు. అంతేకాకుండా ఎంతటి సమస్యకైనా పరిష్కారం చూసుకో గలుగుతారన్నారు. అక్షరానికి అంతటి శక్తి ఉంటుందన్నారు. నూరుశాతం అక్షరాస్యత సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపసంచాలకులు పి వెంకట్రావ్, ఏపీవో సురేఖ పలువురు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

రేపు మార్కాపురంలో జాబ్‌మేళా

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్కాపురంలో ఈనెల 10న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ ఒక ప్రకనటలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మార్కాపురంలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. పేటీఎం, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ పలు కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. పదో తరగతి, పీజీ చదివిన నిరుద్యోగ యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 7013950097 నంబరును సంప్రదించాలన్నారు.

వైపాలెంలోనూ ఏర్పాటు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు) : ఈ నెల 10న యర్రగొండపాలెం పట్టణంలోని బాబుజగ్జీవన్,అంబేద్కర్ భవన్‌లో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళలో పేటీఎం, ఎస్‌బీఐ కార్డు, హెట్‌రోల్యాబ్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటరు నుంచి డిగ్రీ పాసై 19 నుంచి 28 సంవత్సరాల లోపు వయస్సు వున్న వారు అర్హులని అన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి రూ.15వేల నుంచి రూ.20 వేల వేతనం ఉంటుందన్నారు.

విద్యార్థి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

కొమరోలు, సెప్టెంబరు 8: నిరుపేద విద్యార్థి ఆపరేషన్‌కు అమ్మా ఫౌండేషన్ ద్వారా టీడీపీ మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు ఆర్థిక సహాయాన్ని అందించారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల గ్రామం బోగోలు ఆంజనేయులు, రమణమ్మల కుమారుడు బోగోలు చక్రవర్తి పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. దీంతో కాలు విరిగింది. వీరు వైద్యం కోసం గిద్దలూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాలుకు ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితిలో దాతల కోసం ఏదురు చూస్తున్నారు. ఈ క్రమంలో అమ్మా ఫౌండేషన్ నిర్వాహకులు బోనేని వెంకటేశ్వర్లు వైద్యశాలకు వెళ్లి విద్యార్థి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధిత కుటుంబ సభ్యులు బోనేనికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యాక్రమంలో పందరబోయిన భూపాల్ పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న బోనేని

ఘనంగా వాసవిక్లబ్ వారోత్సవాలు

తర్లుపాడు, సెప్టెంబరు 8: వాసవిక్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా జయంతి సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వ హించారు. మొదటిరోజు రక్తదాన శిబిరం, రెండో రోజు క్లబ్ సభ్యులతో రక్తదానం, మూడో రోజు తర్లుపాడు భవిత స్కూల్ విద్యార్థులకు అల్పాహారం, కాస్మోటిక్ వస్తువుల అందజేత, నాలుగో రోజు బాలికలకు పవర్‌మెంట్ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. ఐదో రోజు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు మండల వాసవి క్లబ్ ప్రెసిడెంట్ పీవీ కృష్ణకుమారి తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సెక్రటరీ బి.లక్ష్మీదేవి, ట్రెజరర్ సావిత్రి, సభ్యులు పి.లక్ష్మీనారాయణ, గంగిశెట్టి కిరణ్‌కుమార్, కె.రంగరత్నమ్మలు పాల్గొన్నారు.

దేవరాజుగట్టులో గోశాల ఏర్పాటు

పెద్దారవీడు, సెప్టెంబరు 8: పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో గోశాల ఏర్పాటు చేసినట్లు గోశాల ప్రతినిధి ఎస్.రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయాలు, ఆశ్రమాలకు ఆవులు కావాల్సిన వారు సంప్రదిస్తే ఉచితంగా ఆవులు ఇస్తామన్నారు. వివరాలకు 9885826949 నంబరును సంప్రదించాలన్నారు.

ముస్లిం యూత్ నాయకుడికి అవార్డు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), సెప్టెంబరు 8: ఎర్రగొండపాలెం ముస్లిం యూత్ అధ్యక్షుడు డాక్టరు షేక్ ఇస్మాయిల్ తెలంగాణ ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య చేతుల మీదుగా బంగారు నంది అవార్డు ను శుక్రవారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ 136వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డును అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మార్కాపురం, సెప్టెంబరు 8: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు, గుర్తు తెలియని వ్యక్తి మార్కాపురంలోని కొండేపల్లి రోడ్డుపక్కన పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారం మేరకు పోలీసులు సదరు వ్యక్తిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్ల

- కృష్ణసాయి గ్రానైట్‌లో కూలిన హైవాల్
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 8: గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. నిబంధనలు తుంగలో తొక్కి యాజమాన్యాలు ఇష్టానుసారం రాయిని తవ్వుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా లోపించడంతో క్వారీల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటి నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడంతో కార్మికుల పరిస్థితి దినదినగండంలా మారింది. 2009లో చీమకుర్తి సమీపంలోని హంసా గ్రానైట్‌లో హైవాల్ కూలి 14 మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి భద్రతాచర్యలు కట్టుదిట్టం చేశారు. అయినప్పటికీ కొందరు క్వారీ యాజమానులు తవ్వకాల విషయంలో నిబంధనలు పాటించడం లేదు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పటించుకోవడంలేదు. ఈనేపథ్యంలోనే ఈనెల 5వతేదీ తెల్లవారుజామున రామతీర్థం వద్ద ఉన్న కృష్ణసాయి గ్రానైట్ క్వారీలో హైవాల్ కూలింది. ఆసమయంలో అక్కడ అసలు పనులు చేయడం లేదని యాజమాన్యం చెప్తోంది. సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్పీ దామోదర్ అక్కడ నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు కృష్ణసాయి గ్రానైట్స్ క్వారీ యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనేక ఆరోపణలు

ఓరియంట్ క్వారీని కృష్ణసాయి గ్రానైట్స్ యాజమాన్యం లీజుకు తీసుకుంది. 2006 ఏప్రిల్ నుంచి 2023 మే వరకు ఆ కంపెనీకి లీజు అనుమతులు ఉన్నాయి. తిరిగి మరలా లీజుకు తీసుకునేందుకు మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ క్వారీయింగ్ చేస్తున్నారని అధికారులకు కొందరు ఫిర్యాదులు చేశారు. దీంతో ఈనెల 4న మైన్స్ సేఫ్టీ డీడీ జ్ఞానేశ్వర్ తన సిబ్బందితో కృష్ణసాయి గ్రానైట్‌ను పరిశీలించారు. ఆ మరుసటి రోజే హైవాల్ కూలిపోవడం గమనార్హం. ఇలా అనేక క్వారీలలో వాల్స్‌కు బెంచ్ కటింగ్ లేకుండా తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వారీయింగ్‌లో ప్రతి 7 మీటర్లకు ఒక బెంచ్ కటింగ్ పెట్టాలి. అందుకు విరుద్ధంగా తవ్వకాలు చేయడం వల్లనే ఇలా క్వారీల గోడలు కూలి ప్రమాదాలు జరుగుతున్నాయి.

కృష్ణసాయి యాజమాన్యంపై కేసు నమోదు

కృష్ణసాయి గ్రానైట్ యజమాన్యంపై చీమకుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వారికి సంబంధించిన క్వారీలో హైవాల్ కూలి పడిపోయింది. ఈ మేరకు ఆప్రాంత వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఏమైనా ప్రాణనష్టం జరిగిందా అన్న కోణంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సాయంత్రం హుటాహుటీన క్వారీని పరిశీలించిన తరువాత పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

నేడు క్వారీని పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

కృష్ణసాయి గ్రానైట్‌లో ప్రమాదం జరిగిన క్వారీని మైనింగ్ శాఖ భద్రతాధికారులు సోమవారం పరిశీలించనున్నారు. అక్కడ ప్రస్తుతం క్వారీయింగ్‌కు అనుమతులు లేవు. ఏడాది క్రితం పనులు నిలిపి వేసినట్లు యాజమాన్యం చెప్తోంది. అలాంటప్పుడు గోడ ఎలా కూలిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వరద బాధితులకు సాయం చేయాలి


కనిగిరి, సెప్టెంబరు 8: వరద బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలబడి సహాయ, సహకారాలు అందించాలని టీడీపీ హెచ్ఎంపాడు మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్) అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో వినాయకచవితి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సూచనల మేరకు విజయవాడలోని వరద బాధితులకు ఆహారాన్ని తయారు చేయించామన్నారు. తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు సహకారంతో పదివేల ఆహార పొట్లాలను తయారుచేయించి ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపించామన్నారు. కార్యక్రమంలో నాయకులు గాయం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, పెంచికల రామకృష్ణ, దశరథ, వెంకటనారాయణ, మురహరి నరసయ్య, తెలుగు మహిళలు షేక్ వాజిదాబేగం, కరణం అరుణ, తులసి, దొరసానిపాల్గొన్నారు.

దొనకొండలో విరాళాల సేకరణ

దొనకొండ, సెప్టెంబరు 8: విజయవాడలోని వరద బాధితులను తమవంతుగా ఆదుకునేందుకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాల మేరకు మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రాచగొర్ల వెంకటయ్య, జడ్పీ మాజీ కోప్షన్ సభ్యుడు షేక్ మగ్బూల్‌అహమ్మద్, వల్లపనేని వెంకటస్వామి, కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, సింగమనేని హనుమంతు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, విప్పర్ల శేషు, షేక్ ముసామియా, నూనె డేవిడ్‌సన్, బత్తుల గాలయ్య, బోయపాటి సుబ్బయ్య తదితరులు మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లి గత రెండు రోజులుగా విరాళాలు సేకరిస్తున్నారు.

సీఎం సహాయనిధికి రూ.10 లక్షల చెక్కు అందజేత

పామూరు, సెప్టెంబరు 8: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఆదుకొనేందుకు పామూరు మండలం బొట్లగూడూరు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. సీఎం ఆదేశాల మేరకు కేజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సహాయక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కోటపాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.



చంద్రబాబుకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న కోటపాటి

11న సీఎస్‌పురంలో కబడ్డీ టోర్నమెంట్

సీఎస్‌పురం (పామూరు), సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఈనెల 11న సీఎస్‌పురం మండల కేంద్రంలో వంగవీటి మోహనరంగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.7 వేలు అందజేస్తున్నట్టు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కురిచేడు, సెప్టెంబరు 8: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి దేకనకొండ నుంచి బియ్యం లారీ వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈక్రమంలో బియ్యం తరలిస్తున్న లారీని అర్ధరాత్రి సమయంలో స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, సెప్టెంబరు 8: తాళ్లూరులోని కొర్రపాటివారిపాలెం వెళ్లే మార్గంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటుచేసిన బోర్డులను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.సింగారావు శనివారం ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 474లో 6.17 సెంట్ల విస్తీర్ణంలోగల కొంత భూమిని కొందరు ఆక్రమించారు. పాములకాలనీవాసులు ఫిర్యాదు చేయటంతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని పరిశీలించి ఆక్రమించినట్లు నిర్ధారించారు. ఆ భూమిలోకి ఎవరూ ప్రవేశించవద్దని రెవెన్యూ అధికారులు నిషేధిత బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని ఆక్రమణదారులు తొలగించి భూమిని ఆక్రమించారని వీఆర్వో నాగలక్ష్మి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు తహసీల్దార్ పి.సింగారావు సదరు భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన ఏబీసీ విద్యార్థులు

తాళ్లూరు, సెప్టెంబరు 8: తాళ్లూరులోని శ్రీఏబీసీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో కె.అనీష్‌రెడ్డి(588) మార్కులు, బి.సూర్యప్రకాష్ (583) మార్కులు సాధించారు. ఇటీవల ఆర్‌జేయూకేటీ, ఇడుపులపాయలో జరిగిన కౌన్సెలింగ్‌లో వారు పాల్గొన్నారు. వీరిద్దరికి శ్రీకాకుళం ఆర్‌జేయూకేటీలో సీట్లు కేటాయించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కాలేషాబాబు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు

- పలుచోట్ల విగ్రహాల ఏర్పాటు
- భక్తిశ్రద్ధలతో పూజలు

దర్శి, సెప్టెంబరు 8: వినాయక చవితి వేడుకలను శనివారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. దర్శి మండలంలోని అనేక గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఆయా విగ్రహాల వద్ద ఐదు, తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించి నిమజ్జనాలు చేస్తారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిమలను తెచ్చి గృహాల్లో ఏర్పాటుచేసుకున్నారు. పత్రి, పండ్లు స్వామివారికి నైవేద్యం సమర్పించి సంప్రదాయబద్ధంగా పండగను జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతి విగ్రహాలను దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు. అలాగే, లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో సమకూర్చిన మట్టి విగ్రహాలను కూడా ఆయన పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను సమకూర్చటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, నారపుశెట్టి మధు, శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ స్నేహ అధ్యక్షుడు ఫణిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి, సెప్టెంబరు 8: వినాయక చవితి పండగను శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. కనిగిరి పట్టణంలోని ప్రధాన వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మమ్మ చెట్టు వీధి, జవహర్ లాల్‌వీధి, హనుమాన్ భజనసంఘం వద్ద, ప్రభుత్వ బాలికల హైస్కూల్ వద్ద, సాయిబాబా గుడి వీధిలో, కొత్త పేట, కూచిపూడిపల్లి, కొత్తూరు, పాతూరు తదితర ప్రాంతాల్లో విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి విగ్రహ మంటపం వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించటంతోపాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయిబాబాగుడి వీధిలో ఉన్న విగ్రహం వద్ద చిన్నారులు వేసిన నృత్యాలు అలరించాయి. బోయపాలెంలో అతిపెద్ద వినాయక విగ్రహం ఏర్పాటుచేశారు. విద్యుత్ దీపాలతో మండపాలను ప్రత్యేకంగా అలంకరించారు.



తాళ్లూరు: తూర్పుగంగవరంలో పూజలు అందుకుంటున్న విఘ్నేశ్వరుడు

పామూరులో.. పామూరు, సెప్టెంబరు 8: మండలంలో వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో సుమారు 30 మండపాలు, గ్రామాల్లో 25 వరకు ఏర్పాటుచేశారు. గ్రామాల్లో మూడోరోజు సోమవారం నిమజ్జనం జరగనుండగా, పామూరు పట్టణంలో ఐదోరోజు బుధవారం నిమజ్జన కార్యక్రమాలుని టర్వహించనున్నారు. పట్టణంలో ఆకుల వీధి, తూర్పువీధి, వాసవీమాత దేవస్థానం, అంకాలమ్మ వీధి, నెల్లూరు రోడ్డు, ఎన్జీవో కాలనీ, వడ్డే పాలెం, సీఎస్‌పురం తదితర ప్రాంతాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. బోడవాడ గ్రామంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు డి.కోటిలింగం, టి.రమణయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



పామూరులోని ఆకులవీధిలో పూజలు చేస్తున్న భక్తులు

పామూరు పట్టణంలోని భగత్‌సింగ్ వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సీఎస్‌పురం మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి తన కుటుంబసభ్యుల తరుపున రూ1,01,116 విరాళాన్ని అందజేసినట్టు తెలిపారు. సీఎస్‌పురంలోని ఏనిగడ్లలో గణపతి నవరాత్రులు నిర్వహణ నిమిత్తం రూ.20 వేల నగదును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కురిచేడులో.. కురిచేడు, సెప్టెంబరు 8: కురిచేడు మండలంలో వినాయక చవితి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. పడమర వీరాయపాలెం గ్రామంలోని వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. కాగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ జేబీ రామారావు, వీవీ రమణారావు, కె.రామకృష్ణ, పి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



దర్శి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దొనకొండలో.. దొనకొండ, సెప్టెంబరు 8: మండలంలో వినాయక చివితి వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ప్రత్యేక అలంకరణతో భారీ గణేష్ విగ్రహలు ఏర్పాటుచేసి వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు మట్టి ప్రతిమలు, పూజా సామగ్రిని కొనుగోలు చేసుకొని గృహాల్లో పూజా కార్యక్రమాలు జరుపుకున్నారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, సెప్టెంబరు 8: మండలంలోని శనివారం వినాయక చవితి పండగను ఘనంగా జరుపుకున్నారు. పసుపుగల్లు మెయిన్ వీధిలో పెద్ద వినాయక విగ్రహం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కెల్లంపల్లి పంచాయతీ పరిధిలో, బసవాపురంలో ఉపసర్పంచ్ కట్టా మౌనిక ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో అత్యధికంగా పులిపాడు తండాలో ఎనిమిది విగ్రహాలు ఏర్పాటుచేశారు. మారెళ్ళ, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం, ముండ్లమూరు, పెదఉల్లగల్లు, వేముల, కెల్లంపల్లి, పోలవరం, సింగనపాలెం, నాయుడుపాలెం, ఈదర, కమ్మవారిపాలెం, నూజెండ్లపల్లి, తూర్పుకంభంపాడు, వేంపాడు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారు.

వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకొని నిమజ్జనం చేయాలని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని సింగనపాలెం, ముండ్లమూరు, వేంపాడు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాలను సందర్శించి వినాయక విగ్రహ కమిటీ నిర్వాహకులతో మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా వాగులు, చెరువుల్లోకి దిగే సమయంలో కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనవసరంగా గొడవలు పడి ఇబ్బందులకు గురికావద్దన్నారు.



కనిగిరి: కొత్తపేటలోని వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మండలంలో 75 విగ్రహాలకు సంబంధించి అనుమతులు పొందారని చెప్పారు. ఇంకా కొన్ని గ్రామాల్లో పోలీసుల అనుమతులులేకుండా విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. అలాంటి వారు కూడా అనుమతి తీసుకో వాల్సిన అవసరం ఉందన్నారు. పలు గ్రామాల్లో విగ్రహా ల మండపాలకు పార్టీల జెండాలు పెట్టడం వల్ల సమస్య వస్తుందన్నారు. దేవుడు విగ్రహం వద్ద అలాంటి కార్యక్రమాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మానం నరసింహారావు, కందిమళ్ళ చంద్రమౌళి, బత్తిని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, సెప్టెంబరు 8: వినాయక చవితి పండగను శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలో దాదాపు 40 విగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రతి ఇంటిలో చిన్ని గణనాథులకు పత్రితో ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లు సమర్పించారు. అన్నిగ్రామాల్లో పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు ఆయా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటుచేసిన మందిరాలను పరిశీలించి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు.



ముండ్లమూరు: సింగనపాలెంలో వినాయకుని విగ్రహం వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగరాజు

ప్రశాంతంగా నిమజ్జనానికి ఏర్పాట్లు చేసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 8: పామూరు పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఐదో రోజు బుధవారం నిర్వహించే కార్యక్రమాల్లో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఐ ఎం.భీమానాయక్ సూచించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మండలంలోని గణేష్ మండ పాల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మూడవ రోజు సోమవారం, పట్టణంలో 5వ రోజు బుధవారం జరిగే నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా జరిగే విధంగా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎం.వెంకటరమేష్‌బాబు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లో కూడా సీఐ భీమానాయక్ గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలు జరిగేలా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ బి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠినచర్యలు

పీసీపల్లి, సెప్టెంబరు 8: వినాయకుని నిమజ్జనం జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలని కనిగిరి సీఐ ఖాజావలి అన్నారు. శనివారం మండలంలోని పెదయిర్లపాడు, వరిమడుగు, మురుగమ్మి, నేరేడుపల్లి గ్రామాల్లోని గణేష్ మండపాలను ఎస్సై కోటయ్యతో కలిసి సందర్శించారు. ఆయా మండలపాల వద్ద సీఐ మాట్లాడుతూ గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అవాంచనీయ సంఘటనలు జరిగితే కమిటీ సభ్యులే బాధ్యత వహించాలన్నారు. సమస్యలు సృష్టించి గొడవలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిటీ సభ్యులకు వివరించారు.



పీసీపల్లి: పెదయిర్లపాడులో మాట్లాడుతున్న సీఐ, ఎస్సైలు

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 5: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

నారాయణస్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 8: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గోశాలలోని గోమాతలకు పూజాకార్యక్రమాలు చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహం తీసుకెళుతుండగా ప్రమాదం

- పలువురికి గాయాలు

దొనకొండ, సెప్టెంబరు 8: మండలంలోని దేశిరెడ్డిపల్లి గ్రామస్థులు శనివారం రాత్రి మార్కాపురం నుంచి ట్రాక్టర్‌లో పది అడుగుల భారీ గణేష్ విగ్రహం తీసుకెళుతుండగా దేవరాజుగట్టు బ్రిడ్జి వద్ద ప్రమాదానికి గురయింది. దేవరాజుగట్టు వద్ద ట్రాక్టర్‌ను లారీ వెనుకవైపు నుంచి ఢీ కొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈప్రమాదంలో గ్రామానికి చెందిన నాగిరెడ్డి కోటిరెడ్డి, బ్రహ్మారెడ్డి, వనమాల అచ్చిరెడ్డి, మొద్దుల వెంకటరెడ్డి, గోపిరెడ్డి, దేశిరెడ్డి శివారెడ్డి, చిలకల అవినాష్‌రెడ్డి, టి.వెంకటరెడ్డి తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వైద్యం నిమిత్తం నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడినుంచి అచ్చిరెడ్డిని మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. స్వల్పగాయాలైన వారికి మార్కాపురంలో వైద్యసేవలందించారు. రోడ్డు ప్రమాదం సమాచారం తెలుసుకున్న ఎస్పీ దామోదర్ గ్రామంలో వేడుకలు జరిగేలా గణేష్ విగ్రహం, పూజా సామగ్రి ఏర్పాటుచేయాలంటూ త్రిపురాంతకం సీఐకి ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆయన శనివారం ఉదయం గణేష్ విగ్రహం, పూజా సామగ్రిని గ్రామానికి పంపటంతో వేడుకలు నిర్వహించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవటంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హుటాహుటీన నర్సరావుపేట వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైసీపీ నాయకులు కాకర్ల కృష్ణారెడ్డి, బీఎస్ రాజు, గుమ్మా వెంకటేశ్వర్లు, అచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 8: కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉండే వివిధ విభాగాలకు సంబంధించి ఎమ్మెల్యే ఆసుపత్రి వైద్యులకు ఫొటోలు చూపించి వివరించారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోగులకు నిత్యం వైద్యసేవలు అందించాలన్నారు. ఆసుపత్రుల్లోని అన్ని విభాగాల్లో వైద్య సేవలపై ఎమ్మెల్యే వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), ఎస్ఐ త్యాగరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వర్షాలకు ఛిద్రమైన రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

దర్శి, సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన వర్షాలకు అనేక రోడ్లు ఛిద్రమయ్యాయి. రోడ్లపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో అనేకచోట్ల గుంతలలో నీరు నిల్వఉండటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డులో కంకర, తారు లేచిపోయింది అనేకచోట్ల రోడ్లు గుంతలమయమయ్యాయి. రాజంపల్లి- బొద్దికూరపాడు రోడ్డు రైల్వేలైన్ వద్ద దెబ్బతింది. గ్రామీణ ప్రాంతాల్లో అనేకచోట్ల రోడ్లు ఛిద్రం కావటంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు రోడ్ల దుస్థితి గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.




దర్శి - తూర్పుగంగవరం మార్గంలో బొట్లపాలెం వద్ద రోడ్డుపై పడిన గుంత



అధ్వానంగా పొతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు



సత్తెనపల్లిలోని నాగార్జున నగర్‌లో 61 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం











గుంటూరు: నల్ల చెరువులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు

గుంటూరు: శ్రీనగర్ ఏడవ లైనులో

చీరాలలోని మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శేష పాన్పుపై పవళిస్తున్న గణపయ్య విగ్రహం

తెనాలి: గంగానమ్మపేటలో బంకమట్టితో గడ్డి వినాయకుడు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

- భక్తిశ్రద్ధలతో చవితి ఉత్సవాలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి గణపతికి పూజలు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, సెప్టెంబరు 8: దండాలయ్యా.. ఉండ్రాలయ్యా. జై బోలో.. గణేష్ మహరాజ్‌కూ జై.. గణపతి బప్పా మోరియా, జై గణేశా.. జై జై గణేశా నినాదాలు హోరెత్తగా.. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. చవితి సందర్భంగా గణనాథులను దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యం లో మునిగితేలారు. జిల్లావ్యాప్తంగా శనివారం ఇంటింటా, వాడ వాడలా చవితి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. వీధివీధిన ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమలు, ఇంటింటా కొలువుదీరిన బొజ్జ గణపయ్య వేడుకలతో జిల్లా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం నుంచే అన్ని ప్రాంతాల్లో చవితి సందడి నెలకొంది. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా విభిన్న రూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చవితి రోజున అనేక ప్రాంతాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి గణనాథుల ప్రతిమలను పంపిణీ చేశారు. వీధి వీధినా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాలలో భారీ వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజాది క్రతువులను నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద వేదపఠనం, భక్త బృందాల భజనలతో సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని మొక్కు లు తీర్చుకున్నారు. కాలనీల్లో, అపార్టుమెంట్లలో, వీధివీధిన ఏర్పాటు చేసిన విగ్రహాలు అకట్టుకున్నాయి. వీటిని తిలకించేందుకు పిల్లలు, పెద్దలు బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో వర్షం భక్తుల సందర్శనకు ఆటంకంగా మారింది. మరో వైపు ఆలయాల వద్ద చవితి పండుగ శోభ సంతరించుకుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారు లు తీరారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గణేశ్ మండపాల వద్ద రెండో రోజు ఆదివారం నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల్లో గణనాథులను దర్శించుకునేందుకు వచ్చిన వారికి ప్రత్యేకంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆదివారం పలుచోట్ల గణపతి విగ్రహాలను నిమజ్జనోత్సవానికి తరలించారు.

- సత్తెనపల్లి నాగార్జుననగర్‌లో శ్రీసత్యసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయకుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు జరిగాయి. పర్యావరణ హితంగా ఏర్పాటు చేసిన ఈ వినాయకుడు భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు. బంక మట్టి, వెదురు, వరి పొట్టుతో నెల రోజులు కార్మికులు వినూత్నంగా రూపొందించిన మట్టి గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. వినాయక నిమజ్జనానికి వచ్చే సమయంలో నిర్వాహక కమిటీలు సురక్షితంగా కార్యక్రమాన్ని ముగించుకునేలా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తెనాలి మండలంలోని సంగంజాగర్లమూడి కొమ్ము మూరు కాలువ లాకుల ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించి అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు.
- తెనాలి గంగానమ్మపేటలో గణేష్ మెడికల్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతా నుంచి తెప్పించిన బంకమట్టితో పచ్చిగడ్డి మొలిచేలా వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. దీనిపై రోజూ నీరు చల్లుతూ ఉంటే ఎన్ని రోజులైనా గడ్డి వినాయకుడి లాగానే కనిపిస్తుంది. ఇక పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను దర్శించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఆయా పందిళ్ల వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- బాపట్ల ఏఆర్ కార్యాలయంలో పోలీసులు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద ఎస్పీ తుషార్‌డూడీ దంపతులు పూజలు నిర్వహించారు.

మళ్లీ.. వరద ముప్పు



చెరుకుపల్లి మండలం గూడవల్లి పంచాయతీ పాంచాలవరం రోడ్డులో నీటమునిగిన వేలాది ఎకరాల పంటపొలం

- నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- ప్రభావిత గ్రామాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- పునరావాస కేంద్రాలకు రావాలని లంక గ్రామాల్లో దండోరా
- పది రోజులుగా పొలాల్లో తగ్గని నీరు.. నీటిలోనే 13 వేల ఎకరాలు



వరద ముంపు నుంచి బయట పడి కుళ్లిపోయిన పసుపు పైరు



కొల్లూరు: వరద ముంపులోనే పసుపు పైరు



కొల్లూరు: దోనేపూడి వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు

బాపట్ల, రేపల్లె, సెప్టెంబరు 8: కృష్ణమ్మ మళ్లీ కన్నెర్ర చేస్తోంది. భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహించి ఇటీవలే శాంతించింది.. అనుకు నేంతలో మళ్లీ వరద పోటెత్తుతోంది. వారం రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన కృష్ణానది తీర ప్రాంతాలను ముంపునకు గురి చేసింది. నదీ తీర గ్రామాలు, లంకలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఇంతలోనే రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో ఆదివారం శ్రీశైలంతో పాటు నాగార్జున జలాశయం, ప్రకాశం బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో దిగువ ప్రాంతాల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 24 క్రస్ట్ గేట్ల ద్వారా ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. 20 గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,18,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 4 లక్షల 56వేల 602 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు సమాచారం. బ్యారేజికి వరద పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దిగువ నది ప్రాంతవాసులు, లంక భూముల రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బ్యారేజీ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు మళ్లీ వరద గుప్పెట్లో చిక్కుకోనున్నాయి. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమై వరద హెచ్చరికలు జారీ చేసింది. కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో హేలాషారోన్‌లతో కలిసి కలెక్టర్ జె.వెంకటమురళి పర్యటించారు. అరవింద వారధి వద్ద ప్రవాహాన్ని పరిశీలించారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నదికి వరద ప్రవాహం 5.5 లక్షల క్యూసెక్కులతో చేరుకోవడంతో 2వ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు ప్రకటించారు. అధికారులంతా గత వారంలో చేసిన విధంగానే యథావిధిగా విధుల్లో కొనసాగాలన్నారు. లంక గ్రామాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని మైకుల ద్వారా సిబ్బంది దండోరా చేశారు. ఇప్పటికే చిలుమూరు, కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, ఓలేరు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో సహాయ చర్యలకు అన్ని సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. బ్యారేజీకి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం రాత్రికి బ్యారేజీ దగ్గర వరద ఉధృతి మరింత పెరగనుందనే అంచనాలు నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పెనుమూడికి వరదపోటు రానున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. అర్ధరాత్రికి వరద పెరిగే పరిస్థితి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఇప్పటికే వాణిజ్య పంటలు తుడిచిపెట్టుకుపోగా మళ్లీ వరద ముంచెత్తుతుందనే హెచ్చరికలతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికే వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోయి కుళ్లిపోతున్నాయి. భారీ వరదతో అన్నీ కోల్పోయినా ఇంకా కృష్ణమ్మ తమను కనికరించడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. తీర గ్రామాల్లో వరి పొలాల్లో నీరు తిష్ట వేసి ఉంది. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో 13 వేల ఎకరాలుపైనే నీటిలోనే ఇంకా నానుతున్నాయి.

డీసీసీల నియామకం

- గుంటూరుకు చిలకా విజయ్‌కుమార్
- బాపట్ల జిల్లాకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి
- పల్నాడు బాధ్యతలు మళ్లీ అలెగ్జాండర్ సుధాకర్‌కే
- ఏపీసీసీలో జిల్లా నేతలు పలువురికి దక్కిన పదవులు

గుంటూరు, సెప్టెంబరు 8: కాంగ్రెస్‌లో పదవుల పందేరం జరిగింది. ఇటీవల ఏఐసీసీ పీసీసీతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీలను రద్దుచేసింది. ఈ క్రమంలో ఆ పార్టీ జిల్లాల అధ్యక్షులను నియమిస్తూ అధిష్ఠానం శనివారం ఉత్త ర్వులను జారీచేసింది. ఉమ్మడి జిల్లాలోని మూడు జి ల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. కాంగ్రెస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తాడికొండకు చెందిన చిలకా విజయ్‌కుమా ర్‌ను నియమించింది. ఈయన తాడికొండ నియోజకవర్గం నుం చి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అలానే ప్ర స్తుతం పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న అలెగ్జాండర్ సుధాకర్‌కు మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. బాపట్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించారు. ఇప్పటి వరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా ఉన్న గంటా అంజిబాబును ఆ బాధ్యతల నుంచి తప్పించి ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇక ఏపీసీసీ కమిటీ లోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు పలువురికి స్థానం దక్కింది. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడో సారి ప్రత్తిపాడు నియోజక వర్గానికి చెందిన మదన మోహన్‌రెడ్డికి స్థానం దక్కింది. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా కారుమంచి రమాదేవి, గడ్డం పాల్ విజయ్‌కుమార్, ఏపీసీసీ ఉపాధ్యక్షులుగా కొరివి వినయ్‌కుమార్, ఎమ్ సూర్యానాయక్‌లు ఉన్నారు. మొన్నటి వరకు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలికి ఏఐసీసీలో చోటు దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



చిలకా విజయ్‌కుమార్ | అలెగ్జాండర్ సుధాకర్ | ఆమంచి కృష్ణమోహన్

రహదారులు.. ఛిద్రం

- వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు
- డైవర్షన్ల వద్ద నిలిచిన రాకపోకలు
- ప్రధాన మార్గాలూ గుంతలమయం
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు



నిజాంపట్నం రోడ్డులో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీగుంత

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 8: రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకం. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లను వర్షాలు, వరదలు ధ్వంసం చేశాయి. పది రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా చాలాప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో చప్టాలు గోతులమయంగా మారగా, డైవర్షన్ రోడ్లు కొట్టుకుపోయాయి. మరికొన్ని దగ్గర్ల కోతకు గురయ్యాయి. గోతులు, గుంతలతో నిండిపోయిన రోడ్లు రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా సరైన నిర్వహణ లేని రోడ్లను తాజా వర్షాలు అధ్వానంగా మార్చాయి. గుంటూరుతో పాటు జిల్లాకేంద్రాలైన బాపట్ల, నరసరావుపేటల్లో సైతం రోడ్లు గోతులతో నిండి ఉన్నాయి. ప్రధాన రోడ్లు కూడా వర్షాల తాకిడికి గుంతలు పడి తారు, సిమెంటు లేచి పోయి రాళ్లు బయట పడి వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ మెరక ఉందో అర్థం కాని పరిస్థితి. గోతులలో నీరు చేరడంతో వాహనాలపై వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. మరికొన్నిచోట్ల రోడ్డుపై వేసిన తారు లేచిపోయి అడుగున రాళ్లు బయటపడటంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. రాత్రుళ్లు గోతులు అర్థం కాక ప్రమాదాలు చోటుచేసు కుంటు న్నాయి. నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అధ్వానంగా మారాయి. లో లెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు కోతలకు గురయ్యాయి. భారీ వర్షాలతో పలుచోట్ల వంతెనలు, చప్టాలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో డైవర్షన్ రోడ్లు అయితే చాలావరకు కొట్టుకుపోయి.. ఆయా మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి ప్రజలు వెళ్లాలంటే కత్తిమీద సాములా మారింది.

- తెనాలి నుంచి నారాకోడూరు, కాజీపేట మీదగా గుంటూరు, తెనాలి నుంచి కూచిపూడి, తెనాలి నుంచి మంగళగిరి రోడ్లు గుంతలయంగా మారాయి. అంగలకుదురు - సంగంజాగర్లమూడి రోడ్డు సగభాగం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నందివెలుగు - కొలకలూరు ఫ్లైఓవర్ సమీపంలోని రోడ్డు అడుగుకోక గుంతగా ఏర్పడింది.
- మంగళగిరి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా తయార య్యాయి. చినకాకాని ఎన్నారై వద్ద గౌతమబుద్ధ రోడ్డు కోత గురైంది. తెనాలి రోడ్డులో ఇండోర్ స్విమ్మింగ్ పూల్ ఎదురుగా రహదారి గుంతలమయమైంది.
- తాడికొండ మార్గంలో కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గుంటూరు-అమరావతి రహదారిలో రాకపోకలు నిలిచపోయాయి. పొన్నెకల్లు-దామరపల్లి ప్రధాన రహదారి తటాకాన్ని తలపిస్తుంది. లాం-దామరపల్లి, పొన్నెకల్లులోని లోలెవల్ చప్టాలు కొట్టుపోయి ప్రమాద భరితంగా మారాయి. తాడికొండ-కంతేరు మధ్య ఎర్రవాగు లోలెవల్ చప్టాకి ఇరువైపుల ఉన్న తారురోడ్డు కొట్టుపోయింది. సుమారు ఆర కిలోమీటర మేర రోడ్డు కోతలు పడి 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు బయటపడింది.



గుంతలుగా మారిన చందోలు -పాన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

వరద బాధితులకు ప్రభుత్వ సాయం అభినందనీయం

చీరాలటౌన్, సెప్టెంబరు 8 :కొద్ది రోజులుగా బుడమేరు వరద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం అభినందనీయమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో బుడమేరు నేర్పిన గుణపాఠాలపై నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అహర్నిశలు శ్రమించి బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో విజయవంతమైందన్నారు. వైసీపీ నాయకులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని మరిచి బురద జల్లే పనిలో నిమగ్నమయ్యారన్నారు. వదర నష్టం నుంచి ప్రజలకు కాపాడేందుకు ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ డ్రోన్‌లు, హెలికాప్టర్‌లు, ఫైర్ ఇంజన్‌లు, ఎక్స్‌కవేటర్‌లు, ట్రాక్టర్‌లు ఉపయోగిస్తు అధిక సంఖ్యలో అధికారులు, సిబ్బందితో బాధితులకు అండగా నిలుస్తున్నట్లు వివరించారు. సినీరంగంతో పాటు వివిధ రకాల స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు ధాతృత్వాన్ని చాటుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీనియర్ సిటిజన్స్ నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం, గురు పూజ్యోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రతినిధులు లక్ష్మణరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవతా అధ్యక్షుడు నాగవీరభద్రాచారి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అత్తులూరి రామారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



గ్రానైట్ వ్యర్థాలను చదును చేశాక ఇలా..

సాగర్ కాలువకట్టపై వ్యర్థాలను చదునుచేశారు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మార్టూరు, సెప్టెంబరు 8 : ఎట్టకేలకు బొల్లాపల్లి బ్రిడ్జి వద్ద సాగర్ కాలువ కట్టపై పోసిన గ్రానైట్ వ్యర్థాలను రైతులకు ఇబ్బంది లేకుండా పక్కకు చదును చేశారు. రోడ్డు ప్రక్కకు కాలువ అంచుపై పోసిన వర్థాలను కూడా సరిచేశారు. బొల్లాపల్లి బ్రిడ్జి వద్ద సాగర్ కాలువ కట్టపై, కాలువ అంచులపై, బొల్లాపల్లి గ్రామంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి కొంతకాలంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో గ్రానైట్ వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నాడు. ఈ విషయమై 'సాగర్ కాలువైతే మాకేంటి' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై కోనంకి ఎన్ఎస్పీ అధికారులు స్పందించారు. కాలువకట్టపై గ్రానైట్ వ్యర్థాలను పోసిన వ్యక్తిపై అధికారులు ఒత్తిడితీసుకురావడంతో చేసేది లేక ఆ వ్యక్తి రెండు రోజులు ఎక్స్‌కవేటర్‌తో పోసిన వ్యర్థాలను చదును చేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయించారు. కాలువ అంచులపై పోసినవాటిని కూడా నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చేశారు.

రహస్యంగా ఆవుల తరలింపు

● గుర్తించి వదిలి వేసిన యువకులు

మార్టూరు, సెప్టెంబరు 8 : రవాణా వాహనంలో నల్లపరదా కట్టి లోపల మూడు ఆవులను కట్టి తరలిస్తుండగా యువకులు గుర్తించారు. వాహనాన్ని ఆపి ఆ మూడు ఆవులను బయటకు వదిలివేసిన ఘటన శనివారం రాత్రి మండల పరిధి కోలలపూడి రోడ్డు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లగేజి ఆటోను డ్రైవర్ టిఫిన్ చేసేందుకు శనివారం రాత్రి కోలలపూడి రోడ్డు పక్కన ఆపారు. ఆ సమయంలో వాహనంలో పెద్దగా శబ్దాలు రావడంతో అక్కడ టిఫిన్ చేస్తున్న యువకులు అనుమానంతో వాహనంపై కప్పిన పరదాను తొలగించి చూశారు. బండిలో మూడు ఆవులను కాళ్లకు, నోటికి, ఇంకా పలుచోట్ల ప్రమాదకరంగా తాళ్లతో కట్టేసి ఉండటాన్ని గుర్తించారు. ఆవులను ఎక్కడికి తీసుకెళ్తున్నావని డ్రైవర్‌ను ఆ యువకులు నిలదీశారు. అతను పొంతలేని సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కోలలపూడి, మార్టూరు గ్రామాలకు చెందిన హైందవ శక్తి సంస్థకు చెందిన కొందరు యువకులు అక్కడకు చేరుకున్నారు. ఆవులకు తాళ్లు విప్పేసి కోలలపూడి గ్రామంలో వదిలి పెట్టారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 8 : విజయవాడ శివారు ప్రాంతాల్లోని వరద బాధితులకు సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒకటైన జక్కంపూడి ప్రాంతంలో జరిగే సహాయక చర్యలకు ఎమ్మెల్యే కొండయ్య ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం సీఎం చంద్రబాబు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. బాధితులకు భరోసా కల్పించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు, నాయకులకు పలు అంశాలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు చీరాల నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా సైదా

ఒంగోలు (క్రైం)/ పొదిలి, సెప్టెంబరు 8 : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పొదిలికి చెందిన షేక్ సైదా నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. సైదా 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. గతంలో పార్టీ జిల్లా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం సమితి కన్వీనర్‌గా ఉండి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలను ఏకంచేసి పోరాటం చేశారు. ఆయనకు పదవి రావడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు సైదా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకూ డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన ఈదా సుధాకర్‌రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా శ్రీపతి ప్రకాష్, ఒంగోలు నగర అధ్యక్షురాలుగా దాసరి నాగలక్ష్మిని నియమించారు.



షేక్ సైదా

సేవాతత్పరుడు రామయ్య మృతి

● పార్థివదేహం మెడికల్ కాలేజీకి అప్పగింత

● పలువురు ప్రముఖులు నివాళి

ఇంకొల్లు, సెప్టెంబరు 8 : ఎంతోమందికి ఆర్థికంగా సహాయాన్ని అందించి, పేద వృద్ధులకు చేయూతనందిస్తూ ఇంకొల్లు ప్రాంతంలో ప్రజల మన్ననలు పొందిన భీమవరం గ్రామానికి చెందిన చుండూరి రామయ్య(87) శనివారం రాత్రి స్వగ్రామంలో మృతి చెందారు. రామయ్య పంచాయతీ రాజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం తనకు వచ్చే పెన్షన్ సొమ్ముతో అతని తల్లిదండ్రులు శివయ్య, పిచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రామయ్య మృతదేహాన్ని ఇంకొల్లు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, టీడీపీ నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, బోడాల శ్యాం, కరి శ్రీనివాసరావు, మార్క్, చుండూరి ఆంజనేయస్వామి, పలువురు పాత్రికేయులు సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన కోరిక మేరకు పార్థిదేహాన్ని విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగించారు.



రామయ్య(87) ఫైల్

నిల్వలు నిల్ - తీవ్రమైన ఇసుక కొరత

పూర్తిస్థాయి ఉచిత విధానంపై ప్రభుత్వం మీనమేషాలు

రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు

విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు

డిమాండ్ నేపథ్యంలో భారీగా ధర పెంచి విక్రయాలు

నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరత తీవ్రమైంది. దీంతో ధర పెరిగింది. అయినప్పటికీ తగినంత ఇసుక దొరక్క భవన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం అమలులో మీనమేషాలు లెక్కించడం, దానికి తోడు వర్షాలు రావడం కూడా సమస్య తీవ్రతను పెంచింది. దీంతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అవస్థ పడుతున్నారు. ప్రధానంగా చిన్నచిన్న గృహాలు కట్టుకునే వారి పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లామొత్తంగా సగంలో ఆగిపోయిన గృహాలు పెద్దసంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఇసుకకు వచ్చిన డిమాండ్‌ను కొన్ని ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా ఇసుకను తవ్వి నిల్వ చేసి అధిక ధరకు అమ్ముతున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 11వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక విధానం అమల్లోకి వస్తుందని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ అది ఎంత వరకు సాధ్యమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ వెంటనే ఇసుక పాలసీ మారింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇసుక కష్టాలు తీరిపోయాయని భవన నిర్మాణదారులు ఆనందించారు. సొంతింటి కలను నెరవర్చుకోవాలనుకున్న వారు కూడా సంబరపడ్డారు. కానీ అంతలోనే మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా ప్రభుత్వపరంగా ఇసుక నిల్వలు కనిపించటం లేదు. దీనికితోడు ఇసుక దొరికే రీచ్‌ల్లో తవ్వకునేందుకు అధికారిక అనుమతులు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం విధివిధానాలు ప్రకటిస్తామంటూ రవాణాకు బ్రేక్ వేసింది. ఇటు ఉన్న నిల్వలు అయిపోగా, అటు కొత్తగా ఇసుక తెచ్చుకునేందుకు అవకాశం లేక వినియోగదారులు అవస్థ పడటం ఆరంభమైంది.

నిల్వచేసి విక్రయాలు

నిర్మాణదారుల అవసరాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు రంగ ప్రవేశం చేశారు. ఆయా ప్రాంతాల వారీ కొందరు ఇసుకను అక్రమంగా తవ్వి నిల్వ చేసి విక్రయించడం ప్రారంభించారు. మరికొందరు రేయింబవళ్లు అదే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లామొత్తంగా కాకపోయినా కొన్ని ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు ఇసుక అక్రమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులో పవర్ ఉన్న కొందరు వాహన యజమానులు ఇదే ఆదాయమార్గంగా మార్చుకున్నారు. ధరను పెంచకపోయినా వారి కనుసన్నల్లోనే ఇసుక రవాణా జరుగుతుండటంతో సామాన్యులకు అందటం లేదు. దర్శి నియోజకవర్గంలో గుండ్లకమ్మ, చిలుకలేరు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కాపురం ప్రాంతంలో సుమారు ఎనిమిది చోట్ల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి అమ్ముతున్నారు. ధరను సైతం పెంచేశారు. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన ఇసుకను ఎర్రగొండపాలెంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో కొందరు వ్యక్తులు ట్రాక్టర్ ఇసుకను రూ.1500 ప్రకారం అక్రమంగా విక్రయిస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు, విక్రయాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. కనిగిరి ప్రాంతానికి నెల్లూరు వైపు నుంచి వచ్చే ఇసుక రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

జోరుగా అక్రమ తవ్వకాలు

చీరాలలో ఇసుక అక్రమ అమ్మకాలు కొద్ది రోజుల వరకు తారస్థాయిలో జరిగాయి. గత నాలుగైదురోజులుగా అధికారులు అడ్డుకట్ట వేసినట్లు కనిపిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వేటపాలెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డంప్ ఖాళీ అయిపోయింది. పర్చూరు నియోజకవర్గంలో ఇసుక దొరక్క నిర్మాణ పనులు మందగించాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుకను రూ.6వేల నుంచి 7 వేలకు అక్రమంగా విక్రయించారు. 10 రోజుల క్రితం వరకూ కూడా అక్కడ అలాగే అమ్మారు. ప్రస్తుతం అక్రమ విక్రయాలకు కొంత బ్రేక్ పడటంతో మార్టూరు, పర్చూరు ఇంకొల్లు ప్రాంతాల్లో కూడా ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. అద్దంకి ప్రాంతంలో గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.3500 విక్రయించారు. అదే తరహాలో ఈ ప్రభుత్వంలోనూ అమ్మకాలు మొదలయ్యాయి. మంత్రి రవికుమార్ నుంచి హెచ్చరికలు రావడంతో ధరను రూ. 2,500కు తగ్గించారు. ధర తగ్గటంతో విక్రయాలు పెరిగి ఇసుక కొరత నెలకొంది. కందుకూరు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు బహిరంగంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

కలిసొచ్చిన ఇసుక డిమాండ్

ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడం, ఇసుకకు డిమాండ్ రావడం అక్రమార్కులకు కలిసొచ్చింది. అవకాన్ని ఆసరా చేసుకొని గతం కన్నా ఇసుక ధరను పెంచేశారు. గిద్దలూరు ప్రాంతంలో గతంలో ఉన్న ధర కన్నా టన్నుకు రూ.300 అదనంగా వసూలు చేస్తున్నారు. 35 టన్నుల ఇసుక పట్టే లారీకి 20 టన్నులు మాత్రమే ఎత్తుకునే అవకాశం ఇవ్వడంతో కొనుగోలుదారులు అధికంగా నష్టపోతున్నారు. మార్కాపురం ప్రాంతంలో టన్ను ఇసుకను రూ.2వేలకు విక్రయిస్తున్నారు. ఎర్రగొండపాలెంలోనూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన లారీ ఇసుకపై రూ.7వేలు అదనంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇసుక ధరను అక్రమార్కులు పెంచేశారు.

పట్టించుకోని అధికారులు

ధర పెరగటంతోపాటు సరిపడా ఇసుక దొరక్కపోవడంతో నిర్మాణదారులు పనులను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి వర్షాల సమస్య కూడా తోడైంది. ఇటు అక్రమ వ్యాపారం, ధర పెరిగిపోతున్నా మైనింగ్, ఎస్ఈబీ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులపై కొరడా ఝులిపించడమే తప్ప అక్రమ వ్యాపారం చేసే వారి జోలికి వెళ్లడం లేదు. పైగా అధికార పార్టీ వారు అక్రమ అమ్మకాలు చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 11 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ అందుకు అనుగుణమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

వరద బాధితులకు అండ

కలెక్టర్ అన్సారియా పిలుపుతో ముందుకొస్తున్న దాతలు

జిల్లా నుంచి 1.30లక్షల ఆహార ప్యాకెట్లు, 50 వేల వాటర్ బాటిళ్లు

ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలింపు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : విజయవాడ వరద బాధితులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవతో ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. దాతల సహకారంతో జిల్లా కేంద్రమైన ఒంగోలులోని మూడు ప్రాంతాల్లో ఆహారాన్ని వండించి, ప్యాకింగ్ చేయించి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు పంపుతున్నారు. ఐదు రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం కూడా ఒంగోలు నుంచి లక్షా 30వేల ఆహార ప్యాకెట్లు, 50వేల వాటర్ బాటిళ్లను విజయవాడలోని వరద బాధిత ప్రాంతాలకు పంపారు. సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ రూ.5 లక్షల వ్యయంతో పది వేల పులిహోర ప్యాకెట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ద్వారా విజయవాడకు తరలించారు. జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో పది వేల పులిహోర ప్యాకెట్లను పంపారు. ఇంకోవైపు వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు కూడా బాధితులకు తమవంతుగా విరాళాలను అందజేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి కూడా అవకాశం ఉన్న మేరకు బాధిత కుటుంబాలకు ఆహారం, మంచినీళ్లను అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవతో వాహనాలను ఏర్పాటు చేసి విజయవాడకు పంపుతోంది. ఒంగోలులోని ఏ-1 కన్వెన్షన్ హాలులో ఆహారం ప్యాకింగ్‌ను కలెక్టర్ అన్సారియా ఆదివారం పరిశీలించారు. పులిహోరను రుచి చూసి అక్కడ ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షం కురిసినా ప్యాకెట్లు దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు విజయవాడలో వరద బాధితుల సహాయక చర్యల్లో జిల్లా యంత్రాంగం భాగస్వామ్యమైంది. ఇక్కడి నుంచి వెళ్లిన పారిశుధ్య కార్మికులు అక్కడి పలుకాలనీల్లో సహాయక పనులు చేస్తున్నారు.



ఎ1లో పులిహోర ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా



విజయవాడ బయలుదేరి వెళుతున్న మెప్మా మహిళలు

విజయవాడకు 3 వేల మంది పొదుపు మహిళలు

ఒంగోలు (కార్పొరేషన్) : విజయవాడలో వరద బాధితులకు సేవలందించేందుకు ఒంగోలులోని పొదుపు సంఘాల మహిళలు ముందుకొచ్చారు. మెప్మా సీఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం 3వేల మంది పొదుపు మహిళలు, 150 మంది ఆర్పీలు 50 బస్సుల్లో ఆదివారం విజయవాడకు బయల్దేరి వెళ్లారు. అక్కడ వరద బాధితులకు ఆహారం అందజేయడంతోపాటు, అవసరమైన సేవల్లో భాగస్వాములయ్యారు.

గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్ల

కృష్ణసాయి గ్రానైట్‌లో కూలిన హైవాల్


నేడు పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 8 : గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. నిబంధనలు తుంగలో తొక్కి యాజమాన్యాలు ఇష్టానుసారం రాయిని తవ్వుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా లోపించడంతో క్వారీల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటి నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడంతో కార్మికుల పరిస్థితి దినదినగండంలా మారింది. 2009లో చీమకుర్తి సమీపంలోని హంసా గ్రానైట్‌లో హైవాల్ కూలి 14 మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి భద్రతాచర్యలు కట్టుదిట్టం చేశారు. అయినప్పటికీ కొందరు క్వారీ యాజమానులు తవ్వకాల విషయంలో నిబంధనలు పాటించడం లేదు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పటించుకోవడంలేదు. ఈనేపథ్యంలోనే ఈనెల 5వతేదీ తెల్లవారుజామున రామతీర్థం వద్ద ఉన్న కృష్ణసాయి గ్రానైట్ క్వారీలో హైవాల్ కూలింది. ఆ సమయంలో అక్కడ అసలు పనులు చేయడం లేదని యాజమాన్యం చెప్తోంది. సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్పీ దామోదర్ అక్కడ నిబంధనలు పాటంచడం లేదని గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు కృష్ణసాయి గ్రానైట్స్ క్వారీ యజమానుల పై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనేక ఆరోపణలు

ఓరియంట్ క్వారీని కృష్ణసాయి గ్రానైట్స్ యాజమాన్యం లీజుకు తీసుకుంది. 2006 ఏప్రిల్ నుంచి 2023 మే వరకు ఆ కంపెనీకి లీజు అనుమతులున్నాయి. తిరిగి మరలా లీజుకు తీసుకునేందుకు మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ క్వారీయింగ్ చేస్తున్నారని అధికారులకు కొందరు ఫిర్యాదులు చేశారు. దీంతో ఈనెల 4న మైన్స్ సేఫ్టీ డీడీ జ్ఞానేశ్వర్ తన సిబ్బందితో కృష్ణసాయి గ్రానైట్‌ను పరిశీలించారు. ఆ మరుసటి రోజే హైవాల్ కూలిపోవడం గమనార్హం. ఇలా అనేక క్వారీలలో వాల్స్‌కు బెంచ్ కటింగ్ లేకుండా తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వారీయింగ్‌లో ప్రతి 7 మీటర్లకు ఒక బెంచ్ కటింగ్ పెట్టాలి. అందుకు విరుద్ధంగా తవ్వకాలు చేయడం వల్లనే ఇలా క్వారీల గోడలు కూలి ప్రమాదాలు జరుగుతున్నాయి.



కృష్ణసాయి యాజమాన్యంపై కేసు నమోదు

కృష్ణసాయి గ్రానైట్ యజమాన్యంపై చీమకుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వారికి సంబంధించిన క్వారీలో హైవాల్ కూలి పడిపోయింది. ఈమేరకు ఆప్రాంత వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఏమైనా ప్రాణనష్టం జరిగిందా అన్న కోణంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సాయంత్రం హుటాహుటిన క్వారీని పరిశీలించిన తరువాత పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

నేడు క్వారీని పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

కృష్ణసాయి గ్రానైట్‌లో ప్రమాదం జరిగిన క్వారీని మైనింగ్ శాఖ భద్రతాదికారులు సోమవారం పరిశీలించనున్నారు. అక్కడ ప్రస్తుతం క్వారీయింగ్‌కు అనుమతులు లేవు. ఏడాది క్రితం పనులు నిలిపి వేసినట్లు యాజమాన్యం చెప్తోంది. అలాంటప్పుడు గోడ ఎలా కూలిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పుట్టంరాజుకు నంది పురస్కారం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 8 : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా తిరుపతిలో అభిలాషా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి సంస్థ నంది పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా అద్దంకికి చెందిన పలువురు సాహితీ సంస్థల ప్రతినిధులు, సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీరామచంద్రమూర్తి

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 :ఒంగోలులోని కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిలో ప్రతి వారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆమేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది వెళ్లారని ఆమె తెలిపారు. ఈనేపథ్యంలో మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలన్నారు. దూరప్రాంతాల నుంచి ఒంగోలుకు, డివిజన్, మండల కేంద్రాలకు ఎవ్వరూ రావద్దని కలెక్టర్ కోరారు

ముప్పాళ్ల సొసైటీపై విచారణకు ఆదేశం

● డీసీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 8 : హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విచారణాధికారిగా పీడీసీసీ బ్యాంకు ఏజీఎం సుభానీని నియమించినట్లు చెప్పారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ముప్పాళ్లపాడు సొసైటీలో భారీ అక్రమాలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై డీసీవో వివరణ ఇచ్చారు. నివేదికను రెండు నెలల్లో సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించినట్లు తెలిపారు. అది అందగానే బాధ్యులపై సివిల్, క్రిమినల్, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

ఇన్‌చార్జి జేసీగా శ్రీలత

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : జాయింట్ కలెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలతకు అప్పగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు. రెగ్యులర్ జేసీ గోపాలకృష్ణను ఎన్టీఆర్ జిల్లాలో వరద సహాయ కార్యక్రమాల కోసం ప్రభుత్వం అక్కడికి డిప్యుటేషన్ వేసింది. దీంతో పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు.

పేకాట శిబిరంపై దాడి

మార్టూరు, సెప్టెంబరు 8 : మార్టూరులో కొణిదెనరోడ్‌లో పేకాడుతున్న వారిపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. వారినుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గ్రానైట్ అక్రమ రవాణాలో కోట్లాదిరూపాయలు సంపాదించిన మార్టూరుకు చెందిన ఒక వ్యక్తి ఆఫీసులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,69,500 స్వాధీనం చేసుకున్నారు.

ఇటుకకు గడ్డు కాలం

- భారీగా నిల్వలు
- ప్రభుత్వ గృహ నిర్మాణాలు ప్రారంభమైతేనే గట్టెక్కేది
- ఆందోళనలో బట్టీ నిర్వాహకులు



తిమ్మాయపాలెం సమీపంలోని ఇటుక బట్టీ

అద్దంకి, సెప్టెంబరు 8 : ఇటుక పరిశ్రమకు గడ్డు కాలం వచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటుక తయారీ తక్కువగా చేసినప్పటికీ అవి కూడా అమ్మకాలు లేక భారీగా నిల్వలు పేరుకు పోయాయి. అద్దంకి ప్రాంతం లో దశాబ్దకాలం కిందట వందకుపైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. క్రమేపీ తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం 70కి లోపే ఉన్నాయి. సాధారణంగా ప్రతి ఏటా 10కోట్ల ఇటుకలను తయారీ చేస్తుంటారు. కానీ ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూలీలు ముందుగానే వెళ్లడంతో సుమారు 8కోట్ల ఇటుకలు తయారు చేశారు. నాలుగైదు నెలలుగా కనీసం 2కోట్ల ఇటుకలు కూడా అమ్మకాలు జరగలేదు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో పాటు ఇసుక ఇంకా పూర్తి స్థాయిలో లభ్యం కాకపోవడంతో భవన నిర్మాణాలు సాగడం లేదు. దీంతో ఇటుక అమ్మకాలు బాగా తగ్గిపోయినట్లు బట్టీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి ఇటుకలను తయారు చేశామని, భారీగా నిల్వలు పేరుకు పోవడంతో పెట్టుబడులకు వడ్డీలు పెరిగి మరింత భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ధరలు కూడా తగ్గించి అమ్మకాలు చేయాల్సి వస్తుందని ఇటుక బట్టీల యజమానులు చెప్తున్నారు.

పెరిగిన ఉత్పత్తి వ్యయం

ఇటుక తయారీకి వినియోగించే వరిపొట్టు, బొగ్గు ధరలు భారీగా పెరగడంతో తయారీ వ్యయం భారీగా పెరిగింది. గతంలో టన్ను వరి పొట్టు 2 వేలు ఉండగా, ప్రస్తుతం 6వేలకు చేరింది. ఇక బొగ్గు టన్ను 3వేల నుంచి 9 వేల రూపాయలకు పెరిగింది. వీటన్నింటికీ మించి కూలీల ఖర్చు కూడా బాగా పెరగడంతో ఒక్కో ఇటుక తయారీకి రూ.7 నుంచి రూ.7-50పైసలు ఖర్చు అవుతున్నట్లు ఇటుక బట్టీల యజమానులు తెలిపారు. ఇటుకకు డిమాండ్ లేకపోవడంతో పెట్టుబడి ధర లేక పోయినా నష్టానికి అమ్మాల్సి వస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో ఇటుక బట్టీల నిర్వహణ మరింత కష్టంగా మారే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు చేపడితేనే మరలా ఇటుక అమ్మకాలు ఊపందుకుంటాయని లేకపోతే వచ్చే ఏడాది కూడా తయారీ నిలిపి వేయడం మినహా వేరే గత్యంతరం లేదని పలువురు ఇటుక బట్టీల యజమానులు అభి ప్రాయపడుతున్నారు.



టోల్‌గేట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

మెరుగైన సేవల కోసమే టోల్‌గేట్ ఏర్పాటు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 8 : తీరప్రాంతమైన వాడరేవు సముద్రతీరానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సేవలు అందించేందుకు టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. కీర్తివారిపాలెం వద్ద గతంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పర్యవేక్షణలో టోల్‌గేట్ కొనసాగుతుందన్నారు. తీరంలో పార్కింగ్, పారిశుధ్యం, ఇతర గ్రామాభివృద్ధికి, విద్యుత్ లైట్ల నిర్వహణ తదితది అవసరాలకు టోల్‌గేట్ ద్వారా వచ్చే నిధులను వినియోగిస్తారన్నారు. అంత పారదర్శకంగా ఉండాలలని నిర్వాహకులకు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణ, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది, నాయకులు పిక్క నారాయణ పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో బీటీ రోడ్డును బాగుచేస్తున్న కార్మికులు

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

పంగులూరు, సెప్టెంబరు 8 : అడుగడుగునా భారీ గోతులతో కుంటలను తలపిస్తున్న బీటీ రోడ్డుకు రామకూరు గ్రామ ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్ తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. మండలంలోని రామకూరు గ్రామం నుంచి బొల్లాపల్లి వైపు 16వ నెంబరు జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు నిడివి మూడు కిలోమీటర్లు. ఈ రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులతో ప్రజలు రాకపోకలు సాగించలేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి బ్రాంచి కెనాల్ కట్టపై నిర్మితమైన ఈ బీటీ రోడ్డు దుస్థితిని గుర్తించిన గ్రామ ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్ రూ20వేలు వెచ్చించి గోతులకు రెడ్ మిక్సింగ్‌తో పూడ్చి ఎక్స్‌కవేటర్‌తో బాగుచేచించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. ఉప సర్పంచ్ అశోక్‌కు ప్రజలు అభినందనలు తెలిపారు.

ఇద్దరు యువకులకు గాయాలు

మార్టూరు, సెప్టెంబరు 8 : మండల పరిధిలో కోనంకి నుంచి కోలలపూడి రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్‌లో రెండు ద్విచక్రవాహనాలదారులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. కోలలపూడి గ్రామానికి చెందిన తరుణ్ కుమార్, కోనంకి గ్రామానికి చెందిన అంజనేయులు మోటారుసైకిళ్లపై ఎదురెదురుగా ఢీకొన్నారు. మోటారుసైకిళ్ల రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

వినాయక ఉత్సవాల్లో అపశ్రుతి

టపాసులు పడి ముగ్గురు చిన్నారులకు గాయాలు



చికిత్స పొందుతున్న చిన్నారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : రామాపురంలో వినాయక ఉత్సవాల్లో అపశ్రుతి ఏర్పడింది. దీంతో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పెద్ద బ్యాచ్, చిన్న బ్యాచ్ అని పిలుచుకుంటున్న రెండు వర్గాలకు సంబంధించి గతంలో పలు కేసులు ఉన్నాయి. ఇటీవల పోలీసులు, నాయకుల సహకారంతో కొంతమేరకు గ్రామంలో పరిస్థితులు చక్కబడ్డాయి. ఆదివారం ఉదయం జరిగిన ఘటన మరలా వివాదానికి దారి తీసింది. పెద్ద బ్యాచ్ ఆదివారం గణేష నిమజ్జనం ముగించుకుని ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో చిన్నబ్యాచ్‌కు సంబంధించిన వినాయకుని ఉత్సవాల్లో టపాసులు పేల్చారు. ఆ సమయంలో పెద్దబ్యాచ్ వారు పరుగులు తీసి పక్కకు వెళ్లారు. కానీ అదే బ్యాచ్‌కు చెందిన చిన్నపిల్లలు పొన్నపూడి లాస్య, వాయిల యమున, కుర్రు అనూరాధ టపాసులు తగిలి శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈపూరుపా లెం ఎస్‌ఐ శివకుమార్ క్షతగాత్రులను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. సీఐలు సత్యనారాయణ, శ్రీనివాసరావు హాస్పిటల్‌కు వెళ్లి పరిశీలించారు. విషయంపై ఆరా తీశారు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. ఘటనపై గడియార స్తంభం కూ డలి వద్ద బాధితులు ఆందోళన చేసేందుకు సమాయత్తమయ్యారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారికి సర్ది చెప్పి పంపారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చీరాలటౌన్, సెప్టెంబర్ 8 : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని నాయినిపల్లిలో అందిన సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఓ వ్యక్తి అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న 10 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం కొత్తరెడ్డిపాలెం జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చినగంజాం మండలం మోటుపల్లి పంచాయతీ అడవిపాలెంకు చెందిన మునగాని అజయ్ ద్విచక్ర వాహనంపై చీరాలకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళుతుండగా రోడ్డు క్రాస్ చేసేందుకు ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని కారు వేగంతో ఢీకొట్టింది. ప్రమాదంలో అజయ్ ఎగిరి రోడ్డు పక్క పొలాల్లో పడి గాయపడ్డారు. వేటపాలెం ఎస్ఐ క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు



సత్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న కరణం

టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సత్యం మృతి

నివాళులర్పించిన కరణం, టీడీపీ నేతలు

బల్లికురవ, సెప్టెంబరు 8 : బల్లికురవ మండలం కొండాయపాలెం గ్రామానికి మాజీ సర్పంచ్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పావులూరి సత్యనారాయణ (65) ఆదివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందారు. రెండురోజుల కిందట ఆయన స్వగృహంలో బాత్‌రూంలో కాలిజారి పడిపోయారు. తలకు గాయం కావడంతో గుంటూరు వైద్యశాలకు తరలించారు. కోమాలవోకి వెళ్లి ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని మార్టూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృదు స్వభావిగా పేరు పొంది, పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన సత్యం అకాల మృతిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. సత్యం మృతదేహాన్ని టీడీపీ, వైసీపీ నేతలతో పాటు గ్రానైట్ యజమానులు సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలబలరాం నివాళులర్పించారు. తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కుమారుడు వేణుబాబును ఓదార్చారు. టీడీపీ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్, స్థానిక నాయకులు నివాళులర్పించారు.

వర్షానికి కూలిన చెట్టు



నేల కూలిన చెట్టు

మార్టూరు, సెప్టెంబరు 8 : నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న భారీ చెట్టు శనివారం రాత్రి కూలిపోయింది. వాస్తవంగా పగటి సమయంలో పలువురు వ్యక్తులు చెట్టు పక్కన ఉన్న రోడ్డు ద్వారా కూరగాయల మార్కెట్‌కు, లేదా ఎంపీడీవో ఆఫీస్‌కు వివిధ పనులు కోసం వస్తుంటారు. ఆ సమయంలో చెట్టు కూలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది.

చీరాల ప్రజలకు అండగా ఉంటాం

ఎంపీ కృష్ణప్రసాద్



జరీ కండెలను పరిశీలిస్తున్న ఎంపీ దంపతులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : చీరాల ప్రజలకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉం టుందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. ఎంపీ కృష్ణప్రసాద్ సతీమణి శిరీషతో కలిసి ఆదివారం చీరాలలో విస్తృత పర్యటన చేశారు. ముందుగా సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొని, అక్కడి నూతన నిర్మాణాలను పరిశీలించారు. వేటపాలెం మండల పరిధి ఆమోదగిరిపట్నంలోని వినాయక మండపాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నవితరణ చేశారు. సమీపంలోని ఓ చేనేత కుటుంబం నిర్వహిస్తున్న జరీ కండెలను పరిశీలించి, వానలతో మగ్గం సాగడం లేదని తెలుసుకున్న ఎంపీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట టీడీపీ నాయకురాలు సజ్జా హేమలత, కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ కామాక్షి కేర్ సేవలు అభినందనీయం



దేవరాజును సత్కరిస్తున్న సెంటర్ ప్రతినిధులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : చీరాల పరిధిలోని ప్రజలకు శ్రీ కామాక్షికేర్ హాస్పిటల్స్ వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని విఠల్‌నగర్ మనో వికాస్ కేంద్రం డైరక్టర్ వెంకన్నబాబు అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ డేని సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ తాడివలస దేవరాజు ను, ఫిజియో థెరపిస్ట్ మాధురిని ఘనంగా సత్కరించారు. దేవరాజు మాట్లాడుతూ కీళ్ల పనితీరు, నొప్పులు జీవన మనుగడను సాగించడంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను సంతరించుకున్నట్లు చెప్పారు. నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

- ఎలాంటి ఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యత
- అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, సెప్టెంబరు 8 : వినాయక విగ్రహాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య అన్నారు. అద్దంకి పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల కమిటీల సభ్యులతో ఆదివారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ వినాయక విగ్రహాల వద్ద రాత్రి సమయాలలో కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించుకునేటప్పుడు తగు జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం ఉత్సవాల సమయంలో కూడా ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా తగు జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా అనుమతి తీసుకున్న రోజే కచ్చితంగా నిమజ్జనం చేసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ఆయా వి గ్రహాల వద్ద పరిశీలన చేయడం జరుగుతుందని, ఆ సమయంలో అక్కడ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. టౌన్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 55 విగ్రహాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. అయితే సుమారు 100 వరకు విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తుందని చెప్పారు.



ప్రమాణం చేస్తున్న వాసవీ దేవస్థాన అధ్యక్షుడు, కార్యవర్గం

వాసవీ దేవస్థానం నూతన కమిటీ ప్రమాణం

అద్దంకి, సెప్టెంబరు 8 : అద్దంకి పట్టణంలోని చక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, వాసవీ అర్యవైశ్య కల్యాణ మండపం 9 వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక అర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఊటుకూరు రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా ఆర్వపల్లి హనుమంతరావు, కోశాధికారిగా నేరెళ్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోకూరి వెంకట శ్రీనివాసరావుతో పాటు పలువురు ఉపాధ్యక్షునిగా, ఉప కార్యదర్శులుగా, ఉప కోశాధికారులుగా, లీగల్ అడ్వైజర్స్‌గా, కన్వీనర్స్‌గా, కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో ఊటుకూరు ఉమా అన్నపూర్ణ, పువ్వాడ అనంత శివకోటేశ్వరరావు, సంకా సుబ్రహ్మణ్యం, బోజనపల్లి సత్యనారాయణ, కొత్తమాసు చంద్రశేఖరరావు, సోమిశెట్టి సుబ్బరాయుడు, చిన్ని మురళీకృష్ణ, చిన్ని వీరయ్య, గోపు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షురిగా కోట శ్రీనివాసకుమార్, చిన్ని శ్రీమన్నారాయణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు, శ్రీరాం నాగేశ్వరరావు, మారం హనుమంతరావు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ పదవీకాలం 5 ఏళ్లు కొనసాగనుంది. వారిని పలువురు అభినందించారు.



ఆటోకు జెండా ఊపి ప్రారంభిస్తున్న సంఘ నేతలు

ఆహార పదార్థాల తరలింపు

అద్దంకి, సెప్టెంబరు 8 : విజయవాడ వరద బాధితులకు అంబేడ్కర్ యువజన సంఘం అద్దంకి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆహార పదార్థాలను తీసుకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నేతలు నక్కా కాంతారావు, దెబోరాసరళ, మోదేపల్లి పిహెచ్‌సి వె ద్యులు డాక్టర్ బాలరాజు, గోపతోటి సాంసన్,మందా జోషఫ్, పులిపాటి హేబేలు, యరమోతు నాగయ్య, మట్టకొయ్య బాబు, జోషి పాల్గొన్నారు.

వరద బాధితులకు యూటీఎఫ్ సాయం

చీరాలటౌన్ : వరద బాధితులకు చీరాల యూటీఎఫ్ ప్రతినిధులు తయవంతు సాయం అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపుతో ప్రతినిధులు వస్త్రాలను సమీకరించారు. వీటిల్లో చిన్న, పెద్ద సైజుల వారీగా ప్యాకింగ్ చేసి వాహనాన్ని ఆదివారం భట్టిప్రోలుకు పంపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి



బల్లికురవలో బుజ్జి గణపయ్యను నిమజ్జనానికి తీసుకెళ్తున్న చిన్నారులు



అద్దంకిలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం, పంగులూరులో పూజలందుకుంటున్న బొజ్జగణపయ్య, పర్చూరులో కొలువుదీరిన లంబోధరుడు, చినగంజాంలో గంగమ్మ ఒడిలోకి చేరుతున్న గణపతి

- తొలిరోజే నిమజ్జనాలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువత
- పందిళ్లలో ఎమ్మెల్యే కొండయ్య పూజలు

అద్దంకి, సెప్టెంబరు 8 : ఒక వైపు వర్షపు జల్లులు పడుతున్నా భక్తులు ఉత్సాహంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. అద్దంకి పట్టణం, మండల పరిధిలో సుమారు 100 వరకు విగ్రహాలను ఏర్పాటు చేశారు. వానను దృష్టిలో పెట్టుకొని కొందరు వాటర్ ప్రూఫ్ టెంట్‌లను వేసి జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేశారు. పలు చోట్ల సాంస్కృతిక కార్య క్రమాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ఏడాది గుండ్లకమ్మ నదితో పాటు, అద్దంకి బ్రాంచి కెనాల్, భవనాసి చెరువు, ఇతర చెరువులలో నీరు పుష్కలంగా ఉండడంతో నిమజ్జనోత్సవాలు ఎక్కడికక్కడే జరిగే అవకాశం ఉంది. రెండు దశాబ్దాలుగా నాగులపాడులో రెండు విగ్రహాలను ఏర్పాటు చేయటం, నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. నాగులపాడు వినాయక విగ్రహాలు పట్టణంలో గుండా నిమజ్జనోత్సవాలకు కదిలే సమయంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చి తిలకిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తుంటారు.

చీరాల : నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ఆదివారం వినాయక పందిళ్లలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని పూజలు చేశారు. పట్టణంలోని పాపరాజుతోట, వాడరేవులలో ఏర్పాటు చేసిన వినాయ మండపాలను ఆయన సందర్శించారు. పాపరాజుతోటలో పూజా కార్యక్రమాల అనంతరం తిరుపతి, తిరుమల దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితులు ఎమ్మెల్యే కొండయ్య ఆశీర్వదించారు. నిర్వాహకులు సన్మానించారు. వేటపాలెం మండలం రామాపురంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికే క్రమంలో యువకులు పేల్చిన బాణసంచా పొరపాటున కొద్ది దూరంలో ఉన్న సమూహంపై పడడంతో పలువురికి గాయాలయ్యాయి.

చీరాలటౌన్ : వినాయకచవితి సందర్భంగా భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. ఒకవైపు వాతావరణం ప్రతికూలంగా ఉండి నానుడి వర్షం పడుతున్నా ఉత్సాహంగా గడిపారు. మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ ది టెక్స్‌టైల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు విగ్రహం అందరినీ ఆకర్షించింది. చీరాల కూరగాయల మార్కెట్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలు, పత్రి, పూలు, పండ్లు కొనుగోలుకు ప్రజలు పోటీపడ్డారు. వాటి ధరలు ఆకాశన్నంటాయి.


బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీ నుంచి చిన్ని గణేశుని ప్రతిమలకు భక్తులు పూజలు చేశారు. పందిళ్లలో, ఇళ్లల్లో పూజలు నిర్వహించి కొందరు తొలిరోజే నిమజ్జనాలను పూర్తిచేశారు. చిన్నారులు బొజ్జ వినాయకుని ఉత్సాహంతో నిమజ్జనానికి తరలించారు.

పంగులూరు : ఉత్సాహంగా గణపతి పూజను భక్తులు నిర్వహించారు. శని, ఆదివారాలలో ప్రతేక పూజలు, రాత్రివేళ భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో వినాయక మండపాలను అలంకరించారు.

పర్చూరు : వినాయక చవితి పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయం, తూర్పువారి వీధి, టీనగర్, అద్దంకి మాన్యం, లక్ష్మీపురం, మధ్య బజార్, తూర్పువారి వీధి, కొట్ల బజార్, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంతోపాటు, అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయల సమీపంలో చిన్నారులు సైతం గణనాథుని విగ్రహం ఏర్పాటు చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. నూతలపాడు గ్రామంలోని బొడ్డురాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఆకట్టుకుంది. ఆ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిమట అశోక్, మల్లికార్జున, గ్రంధి గోపికృష్ణ, సురేష్ రాజశేఖర్, రాజేష్ పాల్గొన్నారు. నాగులపాలెం, వీరన్నపాలెం, చెరుకూరు, అడుసుమల్లి, బోడవాడ, అన్నంబొట్లవారిపాలెం, తిమ్మరాజుపాలెం, దేవరపల్లి, ఉప్పుటూరు, పోతుకట్ల తదితర గ్రామాల్లో వినాయక ఉత్సవాలు అత్యంత వేడుకగా జరిగాయి.

మార్టూరు : వినాయక చవితిని మార్టూరు, యద్దనపూడి మండలాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నేతాజీనగర్‌లో యువకులు ఆటపాటలతో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో అలంకరించారు. పడమర బజారు, తూర్పుబజారున గుంటూరు నుంచి తెచ్చిన భారీ వియాక విగ్రహాలు కొలువుదీరాయి. ఆదివారం పలుచోట్ల వేడుకగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తిచేశారు.

చినగంజాం : వినాయకచవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో శని, ఆదివారాలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరించారు. పెదగంజాం, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, కడవకుదురు, పెదగంజాం, మోటుపల్లి, చినగంజాం, సోపిరాల, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, మూలగానివారిపాలెం, నీలాయపాలెం తదితర గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. జై... జై గణేశా అంటూ ఊరు వాడా మార్మోగింది. పలు గ్రామాల్లోని విగ్రహాలను వేడుకగా ఆదివారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.





కావలి టౌన్ : కలుగోళశాంభవి ఆలయంలో 25 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించిన అష్టభుజ వినాయకుడు

జై గణేశా..

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు • వాడవాడలా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ
గణనాథులకు ప్రత్యేక పూజలు • ఉత్సాహంగా ఉట్టి మహోత్సవాలు
పలు ప్రాంతాల్లో అన్నదానం • సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

జైజై గణేశా ?

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 8: జిల్లా వ్యాప్తంగా శని, ఆదివారాల్లో వినాయక చవితి సంబరాలు అంబరాన్ని అంటేలా సాగాయి. ఊరూరా, వాడవాడలా గణపతి ప్రతిమలు, విగ్రహాలు ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం పందిళ్ల వద్ద పలుచోట్ల ఉట్టి మహోత్సవాలు, కోలాటాలు, భజనలు కొనసాగించారు. ఆదివారం మధ్యాహ్నం పలుచోట్ల అన్నదానం చేశారు. రెండురోజూ కూడా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బహిరంగ మండపాల వద్దే కాకుండా ప్రతి ఇంటిలోనూ మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించి, సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకున్నారు. నెల్లూరు నగరంలోని వీధులన్నీ విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడాయి. బాణసంచా కాల్పులతో మారుమోగాయి. గణేష్ మండపాల వద్ద పాటలు, నృత్యాలతో యువత ఉర్రూతలూగారు. కాగా ఈ ఏడాది జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు విజయవాడ వరద బాధితులకు సాయంలో మునిగితేలడంతో పందిళ్ల వద్ద నేతల సందడి పెద్దగా కనిపించలేదు. నెల్లూరు నగరంలోని శివాజీ సెంటర్, రాణా ప్రతాప్ సెంటర్, మాగుంట లేఅవుట్ లంబోదర సెంటర్లలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొని గణపతి విగ్రహాలకు పూజలు చేశారు. భక్తులనుద్దేశించి మాట్లాడారు. అలాగే జిల్లాలోని ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, కందుకూరు, కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గ గ్రామాల్లో చవితి సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

• గణపతి లడ్డూ రూ. 8 లక్షలు

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో లంబోదర మిత్రమండలి ఏర్పాటు చేసిన గణపతి లడ్డూకు ఆదివారం రాత్రి వేలంపాట జరిగింది. ఈ లడ్డూను వేలంలో రూ.8లక్షలకు తేజా డెవలపర్స్ శ్రీనివాసరెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



• భక్తులతో గణేష్ ఘాట్ కళకళ

గణేష్ ప్రతిమలను శనివారం రాత్రి నిమజ్జనం చేసేందుకు తరలివచ్చిన భక్తులతో మూలాపేటలో గణేష్ ఘాట్ కళకళలాడింది. ఉదయం గణేష్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ సేవా సమితి నాయకులు, బీజేపీ అనుబంధ సంస్థ నాయకులు పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



నిప్పో సెంటర్‌లోని గణనాథుడు



బారకాసు సెంటర్‌లోని లంబోదరుడు



నెల్లూరు : హరనాథపురంలో ప్రతిష్ఠించిన పసుపు,కుంకుమ, చందనం పొట్లాలతో తయారు చేసిన వినాయకుడు



కనకమహాల్ సెంటర్‌లోని సీఎంఆర్ వద్ద..



పొదలకూరు: పుట్టాయగుంటలో గోవు పాలు తాగుతున్నట్లు పుట్టలోని వినాయకుడు



గుడ్లూరు జెండా చెట్టు వద్ద ఏర్పాటుచేసిన గరుడవాహన వినాయకుడు



నెల్లూరు : బాలాజీనగర్ లక్కీబోర్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన దశకంఠ గణనాథుడు

24 గంటల్లో చోరీ కేసు ఛేదింపు

• రూ.59.46 లక్షల సొత్తు స్వాధీనం • ఇద్దరు నిందితుల అరెస్టు
• కందుకూరులో జ్యూయలరీ షాపులో దొంగతనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం)/కందుకూరు, సెప్టెంబరు 8: కందుకూరులోని జ్యూయలరీ షాపులో జరిగిన చోరీ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.59.46 లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ జీ.కృష్ణకాంత్ ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. కందుకూరులోని పెద్ద బజారుకు చెందిన అనుముల శెట్టి శ్రీకాంత్ గాయత్రి జ్యూయలరీ షాపును నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులోని 760 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. పక్కన ఉన్న మూడు కిరాణా దుకాణాల్లోనూ దొంగతనానికి పాల్పడి రూ.25 వేల నగదు దోచుకెళ్లారు. బాధితుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్ఐ మహేంద్రనాయక్, సీసీఎస్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారంగా నిందితులు సీతారామపురం బెస్తకాలనీకి చెందిన ఎం బాలనారాయణ, అతని తమ్ముడిని గుర్తించి గాలింపు చేపట్టారు. నిందితులు చోరీ సొత్తును శనివారం రాత్రి విజయవాడలో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రత్యేక బృందాలు వారిని అరెస్టు చేశాయి. వారి నుంచి రూ.56,28,440 విలువ చేసే 760 గ్రాముల బంగారుతోపాటు రూ.3.18 లక్షల నగదుతో కలిపి మొత్తం రూ.59,46,440 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడిన నిందితులు చోరీలను వృత్తిగా మార్చుకున్నారు. ఈ కేసులోని నిందితుడు జువైనల్‌పై గతంలో కలిగిరిలో రెండు, పొదిలిలో రెండు, ఒంగోలు, ఎస్ఆర్ పురంలో ఒక్కో కేసు నమోదై ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో శ్రీకాకుళం జిల్లా పలాస పోలీసు స్టేషన్ పరిధిలో, ప్రకాశం జిల్లా టంగుటూరులో చోరీ కేసుల్లో నిందితుడిగా అంగీకరించారు. మరో నేరస్థుడు బాలనారా యణపై ఒంగోలు పోలీసు స్టేషన్‌లో ఒక చోరీ కేసు ఉందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును 24 గంటల వ్యవధిలో ఛేదించిన కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశర్లు, రూరల్ ఎస్ఐ టీటీ మహేంద్రనాయక్, క్లూస్‌టీమ్ ఎస్ఐ వీ బ్రహ్మయ్య, కానిస్టేబుళ్ల హరిబాబు, రవితేజ, తదితరులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు అందజేశారు.

కందుకూరులో కలకలం

కందుకూరు పెద్దబజారులోని గాయత్రి జ్యూయలర్ షాపులో జరిగిన దొంగతనం తీవ్ర కలకలం రేపింది. వినాయక చవితి రోజు ఉదయాన్నే ఈ వార్త వెలుగుచూడటంతో పట్టణ ప్రజలు నిశ్చేష్టులయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు వినాయక మండపాల ఏర్పాట్లలో పట్టణమంతా సందడిగా కనిపించింది. తెల్లవారేలోగా చోరీ జరిగిందన్న వార్త ప్రజలను విస్మయానికి గురిచేసింది. ఇటీవల కందుకూరులో తరచూ దొంగతనాలు జరగడం పరిపాటిగా మారింది. ఈ తరుణంలో ఇది అతిపెద్ద దొంగతనం కావటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కాగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధిత దుకాణ యజమానులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. తక్షణం దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అయితే దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినా అప్పటికే వారి దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డు కావటం, దొంగలు కూడా గతంలో పలు దొంగతనాలకు పాల్పడిన వారే కావటంతో వారిని పట్టు కోవటం పోలీసులకు సులభతరం అయింది.

రెవెన్యూ యంత్రాంగంలో కదలిక

• ప్రభుత్వ స్థలానికి రక్షణ • ఆక్రమణలు తొలగించి స్వాధీనం

నెల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండల పరిధిలోని బుజబుజనెల్లూరు వద్ద సుమారు రూ.కోటిన్నర విలువైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు రక్షించారు. ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకుని బోర్డులు పాతారు. తహసీల్దార్ లాజరస్ నేతృత్వంలో ఆర్ఐ వెంకటేష్, వీఆర్వో విష్ణులతో పాటు మరికొంతమంది వీఆర్వోలు ఈ ఆక్రమణల తొలగింపులో భాగస్వాములయ్యారు.

సర్వే నంబర్ 63-4లో 80 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో గత కొంతకాలం నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొంత స్థలంలో నిర్మాణాలు కూడా వెలిశాయి. గతేడాది రూరల్ మండల అధికారులు ఈ ఆక్రమణలను అడ్డుకున్నారు. నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు కూడా జారీ చేశారు. కానీ నాడు రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనక్కు తగ్గారు. కానీ ఇప్పుడు మిగిలిన సుమారు 150 అంకణాల స్థలం కూడా కబ్జాకు గురవుతూ వస్తుండడంతో కొందరు స్థానికులు కలెక్టర్ ఓ ఆనంద్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని రూరల్ మండలాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ పోలీసులకు లేఖ రాశారు. ఆక్రమణల తొలగింపు సహకరించాలని కోరారు. ఆదివారం ఉదయం రెవెన్యూ, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో ఆక్రమిత స్థలం వద్దకు వెళ్లి ఆక్రమణలు తొలగించారు. అక్కడ ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లాజరస్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములకు ఫేక్ పట్టాలు సృష్టించి ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తున్న తహసీల్దార్ లాజరస్, ఆర్ఐ వెంకటేష్

బొమ్మవరం చెరువులో కబ్జా

• ఐదు ఎకరాల్లో పంట సాగు

అనంతసాగరం, సెప్టెంబరు 8: మండలంలోని బొమ్మవరం పరిసర గ్రామాల్లో ఎకరా పొలం రూ.5 నుంచి రూ.10 లక్షలు పలుకుతుండగా కొందరు చెరువు భూముల్లో పాగా వేస్తున్నారు. ఇప్పటికే చెరువు రెండింతలు ఆక్రమించేసి పంటలు సాగుచేశారు. ఇంతజరుగుతున్నా ఇరిగేషన్ అధికారుల్లో చలనం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా వినాయక చవితి వేడుక సందర్భంగా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో కొందరు చెరువులో ఐదు ఎకరాల భూమిని చదును చేసి పామాయిల్ మొక్కలు నాటిన వైనం వెలుగులోకి వచ్చింది. నెలరోజుల ముందు ఈ ప్రాం తంలో మొక్కలు తీస్తూ చెరువు ఆక్రమణకు పాల్పడగా స్థానికులు అడ్డుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. తాజాగా మళ్లీ అదే స్థలం ఆక్రమణ చేస్తున్న విషయం తెలుసుకొని వీఏవో కృష్ణ ఆదివారం ఆక్రమణదారులను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. కానీ వారు ఏమాత్రం లెక్కచేయలేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి కబ్జాల చెర నుంచి బొమ్మవరం చెరువుకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువు భూమిలో సాగు చేసిన పంట

అన్‌సీజన్‌లోనూ ధర అదుర్స్

• నిమ్మకాయల రేటు పైపైకి...
• బస్తా రూ.7.5 వేల నుంచి రూ. 10 వేల వరకు..
• హర్షాతిరేకాల్లో రైతులు

పొదలకూరు, సెప్టెంబరు 8 : సాధారణంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నిమ్మకాయలను అడిగే వారుండరు. ధరలు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. అయితే పక్షం రోజులుగా మార్కెట్లో నిమ్మకాయలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు, వివాహాలు, గృహ ప్రవేశాల సందర్భంగా గత నెలలో నిమ్మకు బాగా డిమాండ్ ఏర్పడింది. మంచి ధరలు పలికాయి. ప్రస్తుతం వినాయక చవితి వేడుకల నేపథ్యంలో కాయలు ధరలు అమాంతం పెరిగాయి. బస్తా (లూజు) ధర రూ.7.5 వేలు నుంచి రూ.10వేలు పలుకుతున్నాయి. కిలో రూ.80 నుంచి రూ.110 ధరలు పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. గతంలో ఎప్పుడూ కూడా సెప్టెంబరులో ఈ స్థాయిలో ధరలు పెరిగింది లేదు. తోటల్లో నిమ్మకాయల దిగుబడి గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో రైతులు ఆనందపడుతున్నారు. రైతుల అదృష్టం బాగుండి రెండు బస్తాల నాణ్యత కలిగిన కాయలు తోటలో ఉంటే సుమారు రూ.20వేల వరకు రానున్నాయి. పండుకాయలు కూడా కిలో రూ.60 పైమాటే. ప్రస్తుతం రైతులు నిమ్మ తోటలకు నీరు పెట్టడం లేదు. ఇప్పుడు నీరు పెడితే త్వరగా పూతపూసి కాయల దిగుబడులు, ధరలు లేని సమయంలో వస్తాయంటున్నారు. ఆలస్యంగా నీరు పెడితే జనవరి, ఫిబ్రవరి నెలల్లో కాయల దిగుబడి వచ్చి ధరలు గిట్టుబాటు అవుతాయని రైతులు అంటున్నారు. అయితే ప్రతి సీజన్‌లోనూ కాయలు కావాలనుకునే రైతులు మాత్రం ప్రస్తుతం తమ తోటలకు నీరు పెడుతున్నారు.





ఆత్మకూరు : పంటవీధిలో పూజలు అందుకుంటున్న గణనాథుడు



అనంతసాగరం: వినాయకుడి ప్రతిమ వద్ద పూజలు చేస్తున్న యువత



సంగం: తులసి మొక్కలు పంపిణీ చేస్తున్న రాజరాజేశ్వరానందస్వామి



వలేటివారిపాలెం : పాలకేంద్రం వద్ద కొలువుదీరిన వినాయకుడు



లింగసముద్రంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం

వైభవంగా చవితి వేడుకలు

ఆత్మకూరు, సెప్టెంబరు 8: నియోజకవర్గంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను జరుపుకుంటున్నారు. మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో 67విగ్రహాలు కొలువుతీరాయి. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పంటవీధి, జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్ ఏరియా, తోటవీధి, నాగేంద్రపురం, యాదవ వీధి, పిడుగు రంగయ్యవీధి, అరుంధతీయపాళెం, ఎస్టీకాలనీ, చల్లావీధి, ఎల్‌ఆర్‌పల్లి, జేఆర్‌పేట, వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణ సమీపంలో, స్పార్క్ సిటీ, చాకలవీధి ప్రాంతాల్లో 34 విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉత్సవంలో పాల్గొన్నారు.



ఏఎస్‌పేట : రాజవోలులో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏఎస్‌పేట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శనివారం వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహంచారు. వాడవాడలా గణపతి విగ్రహలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు. రాజవోలులో గత 30ఏళ్లగా వేడుకలు నిర్వహిస్తుండడం తో ఈ ఏడాది కాశీ అన్నపూర్ణేశ్వరి విశ్వేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త చిట్టమూరి వెంకటరెడ్డి సౌజన్యంలో ప్రత్యేకంగా 50కేజీల లడ్డూను తయారు చేయించారు. దాన్ని 3వ రోజు భక్తులకు అందజేస్తామన్నారు.

రక్తదానం శిబిరం

చిరమన గ్రామంలో తూర్పువీధి యూత్ సభ్యులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ కాటంరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక చవితి పండుగ రోజు యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు.

అనంతసాగరం: మండంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగళవారం అనంతసాగరం చెరువులో నిమజ్జనం కార్యక్రమానికి పోలీసులు ఏర్పాట్లు చేశారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం, తిరుమలాపురం, అప్పసముదరం, బండగానిపల్లి, చెరువుపల్లి, శకునాలపల్లి, పుల్లాయపల్లి, కృష్ణంపల్లి తదితర గ్రామాలతో పాటు ఉదయగిరి పట్టణంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. సాయంత్రం నిర్వాహకులు ఉట్టి మహోత్సవంతో పాటు భక్తుల కోసం అన్నదానం చేపట్టారు.

దుత్తలూరు: మండలంలోని నందిపాడు, రెడ్లదిన్నె, నర్రవాడ, పాపంపల్లి, వెంకటంపేట, కొత్తపేట, ఏరుకొల్లు, బ్రహ్మేశ్వరం, రాచవారిపల్లి గ్రామాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుత్తలూరు గుంతబజార్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

గుడ్లూరు: మండలంలో శనివారం వినాయక చవితి వేడు కలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గుడ్లూరు జెండాచెట్టు వద్ద గరుడ వాహనంపై ఏర్పాటుచేసిన వినాయకుని ప్రతిమ భక్తులను ఆకట్టుకుంది. అలాగే రామాలయం వద్ద, సీఐటీయూ, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన ఘననాథులకు పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తూర్పువడ్డెర పాలెం, మిట్టపాలెం, ఎస్టీకాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కూడా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

- **లింగసముద్రం :** వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేశారు.
- **వలేటివారిపాలెం :** మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి కొలువుదీరాడు. భక్తులు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించారు.

కావలి టౌన్: వినాయక చవితి వేడుకలు పట్టణంలో శనివారం వైభవంగా జరిగాయి. వాడవాడలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు చేస్తుండడంతో చవితి శోభ సంతరించించుకుంది. ప్రధాన కూడళ్లలో, వ్యాపార సముదాయాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. రాత్రి పూట ఆయా ప్రాంగణాల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం నెలకొంది. ఉత్సవాలు నిర్వహించే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపా లంకణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలుగోళశాంభవి ఆలయ ప్రాం గణంలో భారీ వినాయక విగ్రహం ప్రత్యేక సెట్టింగులు ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచింది. కొన్ని ప్రాంతాల్లో మూడోరోజు విగ్రహాల నిమజ్జనం చేయనున్నారు.

కావలి రూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలు, చలువ పందిళ్లలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కొత్తపల్లి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కోలాటం, అన్నసంతర్పణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బిట్రగుంట: బోగోలు యాదవపాలెంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా రైల్వే రిటైర్డ్ ఉద్యోగి చిలకపాటి వెంకయ్య భవనమ్మ జ్ఞాపకార్థం మహాలక్ష్మమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను ఆదివారం కావలి టౌన్ బీజేపీ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం ప్రారంభించారు. అలాగే బృందావన వీధిలోని స్వామి వారిని టీడీపీ ఇన్‌చార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు, నేతలు గనిపినేని నాగరాజు దర్శించుకున్నారు. కొత్తూరులోని గణనాథుని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, ఎల్.సుధీర్‌బాబు దర్శించుకున్నారు.



ఉదయగిరి రూరల్ : దుత్తలూరులో జరిగిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంభం దంపతులను జ్ఞాపిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ

దగదర్తి (బిట్రగుంట): ఉచగుంటపాలెం, చౌటపుత్తేడు, తడకలూరు, పెద్దపుత్తేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడి దర్శించుకున్నారు. ఈయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, స్థానిక టీడీపీ నేతలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

కొండాపురం: అన్ని గ్రామాలలో భక్తులు మండపాలలో వినాయకుడిని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు చేసి భక్త లకు తీర్థప్రసాదాలను అందజేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. యువతకు పలురకాల ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అల్లూరు: మండలంలో వీధి వీధినా, వాడవాడలా శనివారం వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉట్టి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ప్రతి ఇంట గణపతి ప్రతిమలను ఉంచి ఉండ్రాళ్లు, పాయసాలను నైవేద్యంగా ఉంచారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయకువి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

జలదంకి: వినాయక చవితిని పురస్కరించుకుని జలదంకిలో ఆదివారం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు వేలాదిగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. కేరింతల మధ్య ఉత్సాహాల మధ్య బండలాగుడు పోటీలు జరిగాయి. అంతకుముందు స్వామికి పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కలిగిరి: అన్ని గ్రామాలలో శని, ఆదివారాలలో వినాయక చవితిని పురస్కరించుకొని ఏర్పాటు చేసుకున్న విగ్రహాల వద్ద స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను దూరప్రాంతాలనుండి వచ్చిన వారు కుటుంబసభ్యులతో కలసి మండపాల వద్ద సంతోషంగా గడిపారు.

సంగం: మండలకేంద్రమైన సంగం రాళ్లచెలిక, శివాజీ సెంటర్, తిరుమనతిప్ప, వడ్డిపాళెం, ముత్తరాశిపాళెం, అంబేద్కర్ నగర్, సాయినగర్, కొత్తూరు, అదేవిధంగా పెరమన, సిద్దీపురం, వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెం, ఎస్‌విఆర్‌పురం, గాంధీజన సంఘం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉట్టి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. యువకులు ఉత్సాహంతో ఒకరికి ఒకరు రంగులు పూసుకున్నారు. రాళ్లచెలిక వీవర్స్ కాలనీ, శివాజీ సెంటర్‌లో వినాయకునికి అభిషేకాలు, హోమం, భక్తులకు అన్నదానం చేశారు.

వింజమూరు: పట్టణంలోని పలు మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వరికుంటపాడు: వినాయకచవితి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పాయూరుపల్లి, తొడుగుపల్లి గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూద న్‌రావు, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మీనారా యణ పూజలు నిర్వహించారు. అలాగే కనియంపాడులోనూ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ పూజలు చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



వరికుంటపాడు: పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



బిట్రగుంట: గణేష్ విగ్రహం వద్ద కమిటీ సభ్యులతో టీడీపీ నేతలు

వరద బాధితులకు ఆర్థిక చేయూత



కాకర్లకు చెక్కు అందజేస్తున్న అశోక్‌చౌదరి

వరికుంటపాడు, సెప్టెంబరు 8: విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు తూర్పురొంపిదొడ్ల సర్పంచ్ కూండ్ల నాగేశ్వరి కుమారుడు అశోక్ చౌదరి తమవంతు చేయూతనిచ్చాడు. రూ.2లక్షల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కును శనివారం శాసనసభ్యులు కాకర్ల సురేష్‌కు విజయవాడలోని అతిథిగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా కాకర్ల అతన్ని ప్రత్యేకంగా అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సందల్‌మాలి

ఏఎస్ పేట, సెప్టెంబరు 8: హజరత్ సయ్యద్ ఖాజ రహమతుల్లా నాయబ్‌రసూల్ సతీమణి హబీబా ఖాతూన్ (దొరసానమ్మ) గంధోత్సవంలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో సందల్‌మాలి కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగడా మహిళా భక్తులు దర్గాలోని అమ్మవారి సమాధికి గంధలేపనం చేశారు. పలు ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. దర్గా నుంచి నాగారఖాజ సెంటర్ వరకు భక్తులు బారులుదీరారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్గా ఈవో మహమ్మద్ హా సేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ వేమారెడ్డి, మండల ఎస్ఐ సైదులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

గడ్డివాముల దగ్ధం

అంనతసాగరం, సెప్టెంబరు 8: పాతదేవరాయపల్లిలో శనివారం ముగ్గురు రైతులకు చెందిన వరి గడ్డివాములు దగ్ధమయ్యాయి. వీటి విలువ రూ.75 వేలు ఉన్నట్లు బాధితులు వాపోయారు. ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని మంట లను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

సబ్సిడీ పేరుతో మోసపోవద్దు

అనంతసాగరం, సెప్టెంబరు 8: రైతులకు సబ్సిడీతో ట్రాక్టర్లు అందిస్తున్నట్లు సోషల్ మీడియా వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అలాంటి ప్రకటనలను నమ్మవద్దని అనంతసాగరం వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరికరాల పంపిణీ పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న యాప్‌లు ఓపెన్ చేసే మీ బ్యాంకు ఖాతా నుంచి మోసగాళ్లు నగదు కాజేస్తారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి ఏదైన సందేహం వుంటే రైతు సేవా కేంద్రాల్లోని అధికారులను సంప్రదించాలన్నారు.

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, సెప్టెంబరు 8: కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో అలకరించారు. తరువాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నిర్వాహకులు భక్తులు అధికసంఖ్యలో అన్నదానం చేశారు.

నందప్రసాద్‌రావు జీవితం ఆదర్శం

వింజమూరు, సెప్టెంబరు 8: పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్, బ్రహ్మర్షి పితామహ పత్రిజీ అంతరంగిక కార్యదర్శి నందప్రసాద్‌రావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని నాయుడుపేట సీనియర్ పిరమిడ్ మాస్టర్లు జ్యోతి, గీత తెలిపారు. వింజమూరులోని శ్రీవేద వ్యాసా వశిష్ట పిరమిడద్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని సేవలతోనే మనిషి ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా నందప్రసాద్‌కు నివాళులర్పించారు.

ఇన్‌చార్జిల పాలనకు మంగళం!

ఆత్మకూరు, సెప్టెంబరు 8: ఆత్మకూరు పంచాయతీరాజ్‌శాఖ సబ్‌డివిజన్ పరిధిలో నాలుగేళ్లుగా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. 2021 జూన్ 4వ తేదీన అప్పటి రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పీఆర్ అధికారులు పనితీరుపై ఆగ్రహించి ఉమ్మడి బదిలీలకు ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే. అప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆత్మకూరుకు మాత్రమే రెగ్యులర్ ఏఈ ఖాదర్‌మస్తాన్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన అనంతరం ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో రెగ్యులర్ అధికారుల నియామకానికి రంగం సిద్ధం అయ్యింది. రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రెగ్యులర్ అధికారుల నియామకం జరిపి అభివృద్ధి పనులు వేగవంతం అయ్యే దిశగా దృష్టి సారించారు. త్వరలో పంచాయతీరాజ్‌శాఖలో రెగ్యులర్ అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆత్మకూరు పీఆర్ డీఈగా ఏడుకొండలు, మర్రిపాడు మండల ఏఈగా శ్రీనివాస్, అనంతసాగరం ఏఈగా శ్రీనివాసులరెడ్డి, సంగం ఏఈగా రామయ్య బదిలీపై రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. చేజర్ల, ఏఎస్‌పేట మండలాల ఏఈ నియామకం ఒక కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది. అదే క్రమంలో పీఐయూ డీఈగా సుధాకరయ్య, ఏఈలుగా మల్లికార్జునరావు, మవేకోరెడ్డిలు బదిలీపై ఆత్మకూరుకు రానున్నట్లు తెలిసింది.

విగ్రహాల ఏర్పాటుకు మన్నేటి చేయూత



నగదు అందజేస్తున్న మన ఫౌండేషన్ సభ్యులు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 8: కొండాయపాళెం, తిరుమలాపురం పంచాయతీలతో పాటు ఉదయగిరి పట్టణంలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి చేయూతనందించారు. శనివారం గంగిరెడ్డిపల్లిలోని తన నివాసంలో ఫౌండేషన్ సభ్యులతో వారికి రూ.5నుంచి రూ.10వేలు అందజేశారు. అలాగే పట్టణంలోని యాదవపాళెంలో అన్నదాన కార్య క్రమానికి రూ.25వేలు చొప్పున రూ.1.50లక్షలను ఇప్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు గాజుల రంతుజానీ, భోగ్యం శ్రీనివాసులు, అర్షద్, బాబు, లక్ష్మయ్య, రామయ్య, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

సంగం, సెప్టెంబరు 8: స్థానిక బ్యారేజీ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను ఆ త్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ ఆదివారం పరిశీలించారు. చెరువులు, కాలువల్లో నీరు లేకపోవడంతో సంగం చుట్టుపక్కల గ్రామాల విగ్రహాలతో పాటు ఆత్మకూరు, ఏఎస్‌పేట మండలాల నుంచి విగ్రహాలు బ్యారేజీ వద్దకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సీఐ వేమారెడ్డికి సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఆత్మకూరు సీఐ గంగాధర్ ఉన్నారు.



సూచనలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

కడనూతల చెరువుకు జలకళ : గ్రామస్థుల హర్షం

బిట్రగుంట, సెప్టెంబరు 8: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ పరిధిలోని కడనూతల చెరువుకు శనివారం నీటి విడుదలతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఆగస్టు 20వ తేదీ నుంచి చెరువు ఎండిపోతుందని ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో పాటు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మండల నేతల కృషి ఫలితమే ఇది అని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆంధ్రజ్యోతి దినపత్రిక యాజమాన్యానికి, టీడీపీ నేతలకు రైతులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



ఘనంగా అంకమ్మ ఆలయ వార్షికోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు, ఎమ్మెల్సీ

కందుకూరు, సెప్టెంబరు 8: కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఉదయం జరిగిన అమ్మవారి అభిషేకం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు హాజరు కాగా ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభస్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీమోహన్, కొడాలి కోటేశ్వరరావు, మేడా మలికార్జున, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8: మాలకొండ ఆలయంలో జరుగుతున్న రిటైనింగ్ వాల్, కొండకింద నుండి కొండపైకి వెళ్లే మెట్లమార్గం పనులను వేగవంతం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని ఆయన తన సతీమణి సౌజన్యతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం, కేశఖండన శాల, లడ్డుప్రసాదం కౌంటర్, దుకాణాలు, గోశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఎస్‌ఐ రాములు, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కామినేని అశోక్, శివయ్య పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 6,01,831

మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 6,01,83 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 4,900, కుంకుమార్చన ద్వారా రూ. 18,960, తలనీలాలు ద్వారా రూ. 21,275, వాహన పూజలు ద్వారా రూ. 2,880, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 1,14,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 320, రూముఅద్దెలు ద్వారా రూ. 12,990, కవర్లు ద్వారా రూ. 4,200, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,47,825, అన్నదానం ద్వారా రూ. 2,69,265, విరాళముల ద్వారా రూ. 5,116 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలియజేశారు.

వరద బాధితుల కోసం విరాళాలు

కందుకూరు: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఆదివారం పలువురు దాతలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వరద బాధితుల సహాయార్థం విరాళాలను అందించారు. కందుకూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ట్రస్టు తరఫున రూ. 25వేలు, కందుకూరు మున్సిపాలిటీలోని కాంట్రాక్టర్లు రూ. లక్ష, పట్టణంలో ప్రణవి చిన్నపిల్లలు, కంటి హాస్పటల్ నిర్వాహకులు డాక్టరు కె నవీన్‌కుమార్, డాక్టరు ఎన్ ప్రశాంతిలు రూ. 50వేలు విరాళంగా ఎమ్మెల్యే నాగేశ్వరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఎమ్మెల్యే అభినందించారు.

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

కందుకూరు ఆర్టీసీ డిపోకు కేటాయించిన మూడు సూపర్‌లగ్జరీ నూతన బస్సులను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా బస్సును నడిపారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానిక టీడీపీ నేతలతో కలిసి పట్టణంలో నూతన బస్సులలో ప్రధాన వీధులలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు డిపోకు లాభాలు వచ్చేలా అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని, అవకాశం ఉన్న మేరకు ప్రజల సౌకర్యార్థం గ్రామీణ రూట్లలో బస్సులు నడపాలని డిపో అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపోలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జి మేనేజరు శ్రీనివాసరావు, సీఐ ప్రసాదు, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, సవిడిబోయిన వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపూడి సర్పంచిపై కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను సర్పంచ్ దగ్గరుండి తన అనుచరులతో దౌర్జన్యంగా తొలగించారని అందిన ఫిర్యాదుతో శనివారం సర్పంచ్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్దిపూడికి చెందిన టీడీపీ కార్యకర్తలు, గ్రామస్థులు వినాయక చవితి సందర్భంగా గ్రామంలో కొత్తూరు బస్టాండ్, వడ్డెరపాలెం వద్ద విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. కాగా, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గ్రామస్థులకు పండుగ శుభాకాంలు తెలుపుతున్న ఫ్లెక్సీలను పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ కూనం అనిల్‌కుమార్‌రెడ్డి తన అనుచరులు తన్నీరు కొండయ్య, కందుల నాగరాజు, తన్నీరు మలికార్జున, తన్నీరు దుర్గారావు, తన్నీరు దుర్గా ప్రసాద్‌లతో అక్కడకు చేరుకున్నారు. గ్రామంలో తనకు తెలియకుండా, తన అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టడానికి మీరెవరంటూ నిర్వాహకులతో వాదనలు పెట్టుకున్నారు. సర్పంచ్ దగ్గరుండి తన అనుచరులను పురమాయించి ఫ్లెక్సీలను చించేసి పక్కన పడేశారు. దీంతో తన్నీరు అంకమ్మరాజు గ్రామస్థులతో కలిసి చేసిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ అనీకుమార్‌రెడ్డితోపాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినుట్లు ఎస్సై తెలిపారు.



టీడీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్న సర్పంచి అనుచరులు

కావాలనే డిప్యూటీ సీఎం ఫ్లెక్సీని తొలగించారు

అల్లూరు, సెప్టెంబరు 8 : తమ అభిమాన నాయకుడు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తొలగించి తమ మనోభావాలను దెబ్బతీశారని దెబ్బతీశారని అల్లూరు బలిజకాపులు మండిపడ్డారు. ఈ విషయంపై ఆదివారం సాయంత్రం బలిజపాలెం వీధిలోని విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి శీనయ్య, పసుపులేటి వెంకట కృష్ణయ్య, బండ్ల శ్రీనివాసులు, కుంచాల శేషగిరి రావు, మంగిశెట్టి సురేష్, సాయి, స్థానిక యువకుకలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8: జాతీయ రహదారి దాటుతుండగా మోటారుబైకును కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రమాదంలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామానికి చెందిన ఎస్ పెద్దిరెడ్డి, అచ్చుతలకు తీవ్ర గాయాలయ్యాయి. పెద్దిరెడ్డి, అచ్చుత మోటారుబైకుపై తిమ్మపాలెం నుండి వలేటివారిపాలెం వస్తుండగా ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

గిరి ప్రదక్షిణకు 17న ప్రత్యేక బస్సు

కందుకూరు, సెప్టెంబరు 8: పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణ కోసం కందుకూరు డిపో నుంచి ఈనెల 17న ప్రత్యేక బస్సు ఏర్పాటుచేస్తున్నట్లు డిపో ఇన్‌చార్జి మేనేజరు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరుతుందని రూ. 2100 టిక్కెట్‌తో గిరిప్రదక్షిణతో పాటు కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్, అరుణాచలం, విష్ణుకంచి, శివకంచి తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుని రావచ్చునని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు 7382889870 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పొరపొచ్చాలకు తావివ్వొద్దు: ఎమ్మెల్యే



కావలి: బ్రిడ్జిసెంటర్ మండపం వద్ద ఎమ్మెల్యే

కావలి, సెప్టెంబరు8: భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారో అంతే భక్తిశ్రద్ధలతో పొరపొచ్చాలు, ప్రమాదాలకు తావులేకుండా విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం చేపట్టాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శని, ఆదివారం పట్టణంలోని పలు వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను తరలించే ట్రాక్టర్ల డ్రైవర్లతో పాటు వారి వెంట వెళ్లే వాహనదారులు ఎవరు కూడా మద్యం సేవించకుండా వాహనాలు నడిపేట్లు చూడాలన్నారు. అనంతరం స్థానిక ముసునూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే నియోజక వర్గంలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. విగ్రహాల నిమజ్జనంను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. కార్యక్రమంలో కావలి డీఎస్పీ వెంకటరమణ, ఒకటో పట్టణ సీఐ ఎండీ ఫిరోజ్, రూరల్ సీఐ రాజేశ్వరరావు, సీఐ పాపారావు ఉన్నారు.

ప్రైవేటు వైద్యశాల ప్రారంభం

కలిగిరి, సెప్టెంబరు 8: స్థానిక కావలి మార్గంలో నూతనంగా నిర్మించిన ప్రైవేటు వైద్యశాలను ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో పూర్తిస్థాయి వసతులు కలిగిన హాస్పిటల్‌ను స్థానికులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

కొండాపురం, సెప్టెంబరు 8: చింతలదీవి, తూర్పు ఎర్రబల్లి, గరిమెనపెంట, సాయిపేటలో ఆదివారం ఉపాధి పనులపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సామాజిక తనిఖీలో భాగంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిగ్రామంలో కూలీలు ఊరిలో లేనప్పటికీ మస్టర్లు వేసుకొని నగదు డ్రా చేసి ఉండటం, కొలతలలో వ్యత్యాసాలను సిబ్బంది తనిఖీలో గుర్తించారు. పనిచేయని వారికి ఎక్కువ కూలీ రావడం, పనిచేస్తున్న వారికి తక్కువ కూలీ వస్తుందని సాయిపేటలో పలువురు ఉపాధి కూలీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొనడంతో గ్రామసభను ముగించారు. కార్యక్రమంలో ఏపీవో చెంచయ్య, ఎస్ఆర్‌పీ నీలకంఠం, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.